కుమారసంభవము

(కాళిదాస కృతికిఁ దెనుఁగు)

మల్లంపల్లి శరభయ్య

C I

కుమారసంభవము

(కాళిదాస కృతికిఁ దెనుఁగు)

మల్లంపల్లి శరభయ్య

(b)

తొలి ప్రచురణ వేయి ప్రతులు.

నల జ్యేష్ఠ బహుళ పంచమి.

1976 జూన్.

ప్రతులకు :

మల్లంపల్లి శరభయ్యా

ఆంధ్రోపన్యాసకుడు

ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల

రాజమహేంద్రవరము.

మూల్యము : 3-00

I

ప్రవేశిక

చిన్ననాఁడు నన్ను శివకథాప్రపంచమునఁ ద్రిప్పుచు మా అమ్మగారు నాకు కుమారస్వామి 'కవి' యని చెప్పినది. ఆయన వాహనము నెమలి యఁట! భిల్లకన్య ప్రియురాలఁట! స్కాందపురాణ మాయనయే రచించెనఁట!

ఆమె చెప్పిన దెంత నిజమైన మాట! ఇంక సృష్టిలో కుమారస్వామికంటె నెవ్వఁడు కవి యుండును?

ఆమె కాళిదాసుకూడ 'కవి' యని చెప్పినది. నా మనస్సులో స్వామియే నిలిచెను. కుమారస్వామి కవి. కాళిదాసు కూడ కవి. వీరిద్దఱికి నేమి సంబంధమో!

నేను రఘువంశము చదువునాళ్ళలో మా నాన్నగారు కాళిదాసు కుమారసంభవము రచించెనని, నేనది చదువవలయునని, చెప్పిరి.

'ఏమీ! కుమారస్వామికథ కాళిదాసు రచించెనా! నాయూహ యెంత నిజమైనది! నా యానందమున కవధిలేదు.

రఘువంశములోనే –

"కుమారవిక్రమః.

కుమారకల్పం సుషువే కుమారమ్.

స్కందస్యమాతుః పయసాం రసజ్ఞః.
సేనాన్య మాలీఢ మివాసురాస్త్రైః.
మయూర పృష్ఠాశ్రయిణా గుహేన.
స్కందేన సాక్షాదివ దేవసేనామ్."

ఇట్లు కుమారస్వామి ప్రశంస వచ్చినపుడెల్ల నా యుత్కంఠ తరంగిత మగుచుండెను.

మానాన్నగారు నాకు కుమారసంభవ పాఠము మొదలు పెట్టిరి. నా ప్రతీక్ష యంతయును ఆ నెమలికై దానిపై నున్న యా స్వామికై.

ఈ కావ్యములో వారు కనిపించి తీరుదురు. స్వామి నెమలినిగూర్చి కాళిదాసొక సర్గమైనను వ్రాసియుండును.

మొదటిసర్గ చదువుచుండగా హిమాచల సానువుల మీఁద 'భిన్నశిఖండి బర్హములు' కనిపించినంతనే నా మనస్సు విప్పికొన్నది. కాని మఱియెచ్చటను ఒక్క నెమలియీఁకయైనను కానరాలేదు.

స్వామి కనిపింపకపోవుట యట్లుండ రెండవసర్గ మొదటనే సత్యలోకము అందులో ఛాందసుఁడైన యా బ్రహ్మ కనిపించినప్పుడు నాకుఁ గలిగిన యాశాభంగమును గూర్చి యిప్పుడేమి చెప్పగలను ?

ఎంతదూరము పోయినను తారకాసురుఁడు పెట్టుచున్న బాధలకు దేవతలు పడుచున్న గోలయే. అది యేమి రుచించును?

అవురా ! ఆ పదిరేండ్ల వయస్సులో కాళిదాసు నన్నెంత కికురించెనని! ఇంతకును నెమలిని కుమారస్వామిని కాళిదాసు తన కావ్యములలో నెచ్చట దాచియుంచెనో వెదకి పట్టికొనవలయును.

రఘువంశములో – ఆ యిందుమతీ స్వయంవర మండపములో రత్నమయాసనాసీనుఁడైన యా మూర్తి యెవరో దూరమునకు మయూరముపై నున్న కుమారస్వామివలెనే కనిపించుచున్నాఁడు. కాని – ఆయన రఘునందనుఁడైన యజుఁడు.

ఇట్లు – కొన్నియేండ్లు గడచెను.

ఒకనాఁడు పూర్వమేఘములో మేఘచ్ఛన్నమైన యాకాశము క్రింద – ఒక కొండ శిఖరముపై ఆకస్మికముగ కుమారస్వామి నెమలి కనిపించినది.

ఆ నెమలి కేకాగర్భితమైన తనకంఠమును – ఆకాశములోనికి నిడివిగ సాచి – ఎదురుగాలికి వెనుక కొరుగుచున్న శిఖండముతో – దిశాంతములకు దృష్టిసారించుచున్నది.

ఏమిటీవి !

సృష్టిలోని వర సౌందర్యమంతయును రాశిపోసినట్లున్నది.

చాక్షుషానందమునకు చరమావధియైనట్లున్నది.

అది – అమ్మవారి కెంత గారాబమైన నెమలి ! ఆమె తన చేతులతో దానియొడలెల్ల నిమురును. నీలకంఠమున ముద్దిడు

కొనును. నేలపై జాఱిపడిన యా నెమలియీకను తన చెవి మీఁది నల్లకలువ రేకుపై నలంకరించుకొనును.

ఆమేఘుఁ డా కొండచఱియపై తనప్రియాణ మాపి పర్వతగుహానిబద్ధ ప్రతిశబ్ద దీర్ఘీకృతములైన మంద్రస్నిగ్ధ గర్జిత ములతో - ఆ నెమలిని న ర్తనమాడించుచుండెను.

అచ్చట - దాని చలిత బర్హాసౌందర్యమునకే నా మన స్సంతయును చూఱవిడిచితిని.

ఓహో! నెమలి యిచ్చట కనిపించినది.

కుమారస్వామి యెచ్చటనో!

నాటినుండి కాళిదాసుని కావ్యప్రపంచములో నెల్ల యెడల కుమారస్వామికై వెదకుచుంటిని. ఎచ్చటను స్వామి కనిపించలేదు.

స్వామిని వెదకుచున్నాననుకొనుచుఁ జిత్రముగ నాకు తెలియకయే నేను కాళిదాసును వెదకుచుంటిని.

రఘువంశ కుమారసంభవ మేఘసందేశములు, మాళవి కాగ్నిమిత్ర విక్రమోర్వశీయ - అభిజ్ఞాన శాకుంతలములు, అను - ఆఱు ముఖములతో స్ఫురిత వివిధవర్ణచ్ఛటా దేదీప్య మానమై యాకాశమంతయు నావరించిన - ఆ భావనాబర్హా ముతోడి ప్రతిభా మయూరముపై నధిష్ఠించియున్న మహాకవికన్న భిన్నముగా మహాసేనుఁ డెచ్చటఁ గనిపించును?

కావ్యనిలీనమై యున్న యాత్మయేకాక - కాళిదాసు మాత్రి మెట్లుండునో యెవ్వరికిఁ దెలియును? ఆ యాత్మను జూచుట యెట్లు?

మహాకవి-కూర్చిన ప్రతి రెండు శబ్దముల సమ్మిళిత నాదములో - ఆయన యాత్మయున్నది. తాను రచించిన సర్వకావ్యములయందును శబ్దార్థములయొక్క తాదృశమైన యవినాభావమును పరివేష్టించికొని నాదమయమై యున్నది. మఱల - తన కావ్యములలోనే ఒక్కొక్క కావ్యములోని యా నాదలక్షణమునుబట్టి ఒక్కొక్క రీతిగా నున్నది.

మహాభావుకుల హృదయములలో శాశ్వతముగ సర్వ మహాకవుల యాత్మలును నిత్యములై యిట్లే నాదమయములై యున్నవి.

కుమారసంభవ కవితారీతిలో కాళిదాసుని యాత్మ కుసుమములో ఫలమువలె, ఉమాశరీర లావణ్యమునందు కుమారస్వామివలె, నిలీనమై దాఁగియున్నది.

స్థాణువనము నావరించిన - ఆ యకాల వసంతశోభవలె - ఆ వసంత ప్రసూన కాంతిమయ లోకములలో - స్థావర రాజకన్యా సౌందర్యమువలె - కుమారసంభవములోని ప్రత్యక్షరమునందును - కాళిదాసుని ప్రతిభ సముజ్జ్వలమై వెలుఁగుచున్నది.

కవితకు - ఆకృతియును, ఆత్మయు నుండును.

ఆకృతికి సంబంధించిన దంతయును పార్వతీదేవియొక్క వైభవమే.

ఆత్మ పరమశివుఁడు.

కాళిదాసు రెండు మహాకావ్యములను నిర్మించెను.

అవి రెండును - ఆయన కవితలోని యాకృతి సౌందర్యమునకు, ఆత్మసౌందర్యమునకు శిఖరాయమాణము లైనవి.

మహాకవి కావ్యములలో నెల్ల యెడల గోచరించు రూపవిధాన యత్నమంతయును, కుమారసంభవ కవితారీతిగ పరిణమించి సాఫల్యము నందినది. ఆకృతిసౌందర్య మీ కావ్యము నందువలె మఱియెచ్చటను పరాకాష్ఠ వహించియుండదు. భూతభవిష్యద్వర్తమానములలో - ఈ సృష్టియం దెవ్వరికిని దొరకని పరమోదాత్తమైన వస్తువు కాళిదాసునకు లభించినది. కిన్నరరాజకన్యకాగేయమానమై హిమాచల సానువుల నుండి మందాకినీ ప్రవాహమువలె లోకపావనమై మోడికలు గట్టిన, ఆదిమదంపతులగు పార్వతీపరమేశ్వరుల పరిణయగాథ ఆయన కావ్యవస్తువు.

సృష్టికి మూలహేతువైన కామార్థదైవతము రతిద్వితీయముగ సాకారమై వచ్చి తత్కథా ప్రవర్తనములో - ఉపకరణీభావమును దాల్చినది. సంయోగ వియోగరూపమున ద్విధా

విభక్తమైన శృంగారరసతత్త్వము, శివతత్త్వముకంటె నభిన్న మని నిరూపితమైనది. శివతపోఽగ్ని నిర్దగ్ధమై కామము భస్మావశిష్టమై పోయినను, శృంగార రసస్థాయియైన రతి జీవించియే యున్నది. కావుననే పార్వతీ తపోవహ్నినుండి యుజ్జ్వల రసాకృతియైన పరిణయతత్త్వముగ పునరుజ్జీవితమైనది. ధర్మావిరుద్ధమై పరిణయాకృతిగ పరిణతమైన యీ పరిణయమునుండి యావిర్భవించిన కుమారుఁడు జగదుపప్లవమును శమింపఁజేసి లోకకల్యాణమూర్తియైన రీతిని లోకోత్తరముగ కుమారసంభవము పరిదర్శించుచున్నది.

ఈ వస్తువును కాళిదాసు తన కావ్యమునందు విన్యాసించిన తీరును ఉమాసౌందర్యము వ్యాజముగ –

"ఉన్మీలితం తూలికయేవ చిత్రం
సూర్యాంశుభిర్భిన్నమివారవిందమ్"

అని యుల్లేఖించెను.

కుమారసంభవముయొక్క – నిర్మాణ సౌందర్యమును సూచినట్లు చెప్పవలెనన్నచో – పై యుపమానములకన్న శరణ్యము లేదు.

అది – తూలికోన్మీలితమైన చిత్తరువు.

సూర్యాంశు వికసితమైన యరవిందము.

రేఖాసలీనమైయున్న చిత్రగత సౌందర్యము, సముచిత వర్ణసమ్మేళనమున తూలికతోఁ దీర్చిదిద్దినపుడు సముజ్జ్వలమై

ప్రకాశించును. దేనికదిగా పూర్ణ వికసితమయ్యును కమలదళము లన్నియును కర్ణికాశ్లిష్టములైనట్టులు - కథాంశములన్నియును ప్రధాన వస్తువుతో సుశ్లిష్టము లైనపుడే కావ్యశరీరమునకు సౌష్ఠవము సమగ్రతయు నేర్పడును.

సౌందర్య శబ్దమున కర్థ మిదియే.

ఉమాజననాదులైన కథాంశముల కన్నింటికి ప్రధాన వస్తువగు కుమారజననముతో అపరిహార్యమైన నిబిడసంబంధము కలిగియుండి కావ్యశరీరమున కట్టి సౌష్ఠవ మేర్పడినది. సౌష్ఠవానురూపమైన కాంతివిశేషమును మొదటి యుపమానము సూచించుచున్నది.

ఇదియంతయు మనసులో నుంచికొనియే కాళిదాసు -

"సానిర్మితా విశ్వసృజా ప్రయత్నాదేకస్థ సౌందర్యదిదృక్షయేవ" అన్నాడు.

కుమారసంభవము నిట్లు నిర్మించిన కాళిదాసు లోకసంగ్రహార్థమై రఘువంశమును మఱియొకవిధముగా నిర్మించెను.

ఆత్మ - గుణములలో అభివ్యక్తినందుచుండును.

ఇచ్చట - ఆకృతికి ప్రాధాన్యము లేదు. అట్టి గుణప్రధానమైన యాత్మసౌందర్యము రఘువంశ కవితయందువలె మఱి యెచ్చటను, ఆవిష్కృతము కాలేదు. రఘువుల గుణానుకీర్తనమె యుండలి వస్తువు.

"తద్గుణైః కర్ణమాగత్య చాపలాయప్రచోదితః"

ఆ రఘువుల గుణము లెట్టివి ?

వారు– ఆజన్మ పరిశుద్ధులు. ఆఫలోదయ వ్యవసాయులు. ఆసముద్ర క్షితీశ్వరులు. ఆనాక రథవర్త్మలు. యథావిధి హుతాగ్నులు. యథా కామార్చితార్థులు. యథాపరాధ దండులు. యథా కాలప్రబోధులు. త్యాగార్థమై సంభృతార్థులు. సత్యార్థమై మితభాషులు. యశోఽర్థమై విజిగీషువులు. ప్రజార్థమై గృహమేధులు. శైశవమునందే అభ్యస్తవిద్యులు. యౌవనమందె భోగాసక్తులు. వార్ధకమునందు మునివృత్తులు. అవసానమున యోగముచేత త్యక్తదేహులు.

కాళిదాసు పై సర్వగుణములను సర్వరాజులలో వర్ణించుచు విశేషించి యొక్కొక్క గుణమునకు – ఒక్కొక్క రాజును మూర్తీభావముగఁ జిత్రించెను.

ప్రజార్థమై గృహమేధి దిలీపుఁడు. యశోఽర్థమై విజిగీషువు. రఘుమహారాజు. సత్యార్థమై మితభాషి. దశరథుఁడు. యథాపరాధ దండుఁడు శ్రీరామచంద్రుఁడు.

మనువునుండి యీ రాజర్షు లందఱును పురుషోత్తములై లోకసంగ్రహ మొనర్చిరి. మందాకినీతరంగపరంపరవలె సూర్యప్రభవమైన యీ రాజపరంపర జగత్కల్మషక్షాళన మొనరించుచు లోకపావన మయ్యెను.

అట్టి యీ కుమారసంభవ కవితయందును,
ఇట్టి యీ రఘువంశ కవితయందును,

అనుస్యూతమై కాళిదాసుని యాత్మలక్షణము గోచరించుచున్నను, కవితాధర్మ మొక్కటియైనను - ఒకానొక భేదము సహృదయైక వేద్యమై భాసించుచున్నది.

పరమేశ్వరుని కొఱకై పంచాగ్ని తపమునఁ గ్రాఁగుచున్న అపర్ణాతనూస్వర్ణమునందలి దీప్తి కుమారసంభవ కవితారీతి నలమికొనియుండును.

తపఃఫలసిద్ధి నంది శరీరార్ధమునేకాక పరమశివ భావమునుగూడఁ గైవస మొనరించికొనిన పార్వతీ ముఖమండలమునందలి శాంత తేజము రఘువంశ కవితారీతి యందు సాక్షాత్కరించుచుండును.

కుమారసంభవము మొదట వస్తునిర్దేశము మాత్రము చేసిన కవికులగురువు రఘువంశము మొదట నమస్కారము చేయుటలోని యంతరార్థ మిదియే.

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ"

శృంగార రసవాహిని యొకటి. శాంతరసవాహిని మఱియొకటి.

గౌరీస్వరూప మొకటి. మందాకినీ స్వరూపము మఱియొకటి.

శరీరార్థమున నొకటి. శీర్ష తలమున మఱియొకటి.
రెండింటికిని నిరంతరస్పర్ధ.

ఈ స్పర్ధను తన సర్వకావ్యములయందును కాళిదాసు బహుధా ఉల్లేఖించెను.

ఒకొక్కసారి యొక్కొక్కటి పై చేయి యగుచుండును.

"వికీర్ణ సప్తర్షి బలిప్రహాసిభి
స్తథా న గాంగైస్సలిలైర్దివశ్చ్యుతైః
యథా త్వదీయై శ్చరితై రనావిలై
ర్మహీధరః పావిత ఏష సాన్వయః"

ఈరీతిని కుమారసంభవములో గౌరి అతిశయించుచుండగా -

మేఘసందేశమునందు మందాకినీదేవి -

"గౌరీ వక్త్ర భ్రుకుటిరచనాం యా విహస్యేవ ఫేనైః
శంభోః కేశగ్రహణ మకరో దిందులగ్నోర్మిహస్తా"

ఇట్లు విజయహాస పురస్సరముగ శంభుని కేశగ్రహణ మొనరించి తన వాల్లభ్య గర్వమును ప్రకటించికొనుచున్నది.

యథార్థమునకు పరమేశ్వరుని విడిచి యీ యుభయమునకు స్ఫురణయే లేదు. ఏతాదృశ రసద్వయశబలితమైన శివ తత్త్వమే కాళిదాసుని కవితా తత్త్వము.

గౌరీ మందాకినుల కిరువురకును ప్రభవస్థానము హిమాలయమే. కాళిదాసు ప్రతిభాశిఖరములనుండి లోకపావనియై రఘువంశమందాకిని యవతరించినది.

హృదయమునుండి జగజ్జననియైన పార్వతీదేవివలె
కుమారసంభవ కవిత యావిర్భవించినది.

కాళిదాసే హిమాలయుఁడు.

ఆయన కథాక్షేత్రముకూడ హిమాలయమే.

ఇంకఁ జదువుఁడు –

"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా
హిమాలయో నామ నగాధిరాజః
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య
స్థితః పృథివ్యా ఇవ మానదండః

సర్వం శివమ్

రాజమహేంద్రవరము
నలజ్యేష్ఠ బహుళ పంచమీ,
బుధవారము.

మల్లంపల్లి శరభయ్య

కుమార సంభవము

ఉత్తరదిశయందు దేవతాత్మమైన హిమాలయమను నగాధిరాజము పూర్వాపరవారిరాసులను చొచ్చుకొని - పృథివీ పరిణాహ మానదండమువలె నెలకొని యుండును. తొల్లింటి శైలవృద్ధులు ఆగిరిరాజును లేగదూడగ సంతరించి; దోహన దక్షుడైన మేరువు దోగ్ధయైయుండ - భాసమానములైన రత్నములను, మహౌషధులను పృథువు సమ్మతిఁ బడసి మన్నుమొదవును పిదికిరి. అనంతరత్నప్రభవమైన ఆయచలరాజు సౌభాగ్యమునకు నీహారము కొంతకలిగించునది కాలేదు. గుణరాశిలో ఒక్క నెరసు - జాబిల్లి కిరణములలో మచ్చవలె మునిఁగిపోవును.

మొయిలుతునకలపై చెదరిన యెఱ్ఱదనాలతో అకాలమున మలుసంజరేకల వెలయించి, సొగసుకై సేతలలో అచ్చరలను సంభ్రమింపఁజేయు జేగుఱాల మొత్తములు ఆగిరిశిఖరములపై సమృద్ధిగఁగలవు. పై చరియలను ఒరసికొనుపోవు మొయిలునీడలు క్రింది చరియలపైనున్న తమమీద పొలయునంతనే జడివానలకు అలజడి పొందిన సిద్ధులు ఆతపస్థగితములైన తద్గిరిశిఖరములను ఆశ్రయించుచుందురు. ద్విపకుంభ విదారణమొనర్చి చనిన రక్తచరణాంకములు కరగిన మంచులో సురిగిపోయినను, గోళ్లసందుల నుండి జాఱిన ముత్యములనుబట్టి అచట కిరాతులు సింహముల జాడలు తీయుదురు. ఏనుగుపొడలవలె పాటలవర్ణములైన భూర్జతరవుల బెరళ్ళు గైరికరసముతో వ్రాసిన వ్రాలతో - అచట

విద్యాధర సుందరులకు ప్రణయలేఖార్థముపయోగపడుచుండును. చరియలపై మొగమునుండి విసరు కొండతెమ్మెరల యురవళ్లతో పాదవెదుళ్లకల్పింతలు సింపుచు - ఆకొండజేడు కిన్నరసంగీతగోష్ఠులలో తాను గూడ పాలుగొని తానప్రదాన మొనరించు తలంపుగలవానివలె తోచుచుండును. సంశ్రద్రుమస్కంధములపై ఒరిగి గిరి ద్విపములు చెక్కిలి తీట లోరసికొనువేళ దొరగిన పాల కసటు వలపులతో ఆ కొండచరియలు గుబాళించుచుండును. గుహాలవాకిళ్లలో వెలుగుముగ్గులు తీర్చుచున్న ఓషధీలతలు వనితాసఖులైన వనేచరులకు రేల తైలశూన్యకేళీప్రదీపము లగుచుండును. కరడుగట్టిన మంచుబాట కాలివేళ్ల యంచులు జివ్వుమనిపించుచున్నను దుర్వహాశ్రోణి పయోధరభరాలసలైన కిన్నరస్త్రీలు మందగతి మాన లేరు. దివాభీతమువలె తన గుహాలలో దాగియున్న అంధకారమును ఆ పర్వతరాజు సూర్యుని బారినుండి కాపాడుచుండును. ఎంత క్షుద్రుడైనను శరణు సొచ్చినవానియందు మహోన్నతులు సజ్జనునియందు వలెనే మమత నెరపుదురు. ఇటునటు-అల్లార్చు వేళల బెళుకు లొలయించుచు శశిమరీచిగౌరములైన తమవాలవ్యజనములతో చమరీ మృగములు ఆ పర్వతముయొక్క గిరిరాజ శబ్దమును అర్థవంత మొనరించుచుండును. వలిపములూడియు బడి విలజ్జితలగుచున్న కింపురుషాంగనలకు దరీగృహద్వారముల నలవోకగా ఆవరించిన జలదములు తెరలు తీర్చుచుండును. మిన్నేటిసెలల తుంపురులను మోసికొనుచు; మిన్నక దేవదారు

ద్రుమముల నల్లన కదలించుచు నెమళ్ల పురులువిప్పుచు ఆ వలి మల తెమ్మెరలు మృగాన్వేషణ పరిశ్రాంతులైన కిరాతుల సేద దీర్చుచుండును. క్రిందుగ పయనించుచున్న కర్మసాక్షి ఊర్ధ్వ ముఖములైన మయూఖములతో సప్తర్షి హస్తాపచితావ శేషములగు తత్పర్వతాగ్ర సరోరుహములైన పద్మములను మేలుకొలుపుచుండును. యజ్ఞపరికరములకు ప్రభవస్థానమనియు, ధరిత్రీధరణ క్షమసారమనియు వివేచించి ప్రజాపతి స్వయముగ ఆ హిమవంతునకు యజ్ఞభాగకల్పనాసహితమైన శైలాధిప త్యము నొసఁగెను.

మేరుసఖుడు, స్థితిజ్ఞుడు నగు ఆ గిరిరాజు తన కులస్థితికై పితృదేవతలకు మానసకన్యయు, మునిమాన్యయు, ఆత్మానురూప యునైన మేనను యథావిధిగ పరిణయ మయ్యెను. ఆయిరువు రకు స్వరూపయోగ్యరతి ప్రసంగమున కాలము గడచుచుండ మనోహరయౌవనయైన భూధరరాజపత్ని గర్భవతియై నాగవ ధూపభోగ్యుడైన మైనాకుని గనెను. అంభోనిధితో బద్ధస్నేహ ముగల ఆమైనాకు డొక్కడే శైలసంతతిలో కులిశప్రహార వేదన నెఱుగని భాగ్యశాలి!

అంతట భవుని పూర్వపత్ని – సతి యను దక్షకన్య పితృప్రయుక్తావమానమున యోగముచేత దేహమువిడిచి, పున ర్భవమునకై ఆ శైలవధువును పొందెను. సమాధిమతియైన ఆ మేనయందు భూధరరాజు వలన ఆ సర్వమంగళ అపరిక్షతనీతి యం దుత్సాహముచేత సంపదవలె ప్రభవించెను. ఆమె జన్మ

దినమున దిక్కులు ప్రసన్నభావము దాల్చెను. అనిలములు పాంసువిరహితములై వీచెను. శంఖస్వనములు వినవచ్చెను. పూలవానలు కురిసెను. స్థావరజంగమ ప్రాణులయందొకానొక నిర్వృతి భాసించెను. నవమేఘశబ్దముతో భూగర్భము భేదించికొని వచ్చిన రత్నశలాకతో విదూర పర్వతప్రాంత ధరిత్రివలె - ప్రభామండల శోభమానయైన ఆ శిశువుతో సవిత్రి దేదీప్యమానయై ప్రకాశించెను. లబ్ధోదయయైన చంద్రలేఖవలె దినదిన ప్రవర్ధమానయై ఆ శిశువు లావణ్యమయములైన అంగకములను జ్యోత్స్నాగర్భితములైన కళలనువలె పెంపుచేసెను. బంధుప్రియయైన ఆ బిడ్డను బంధుజనము తండ్రిపేర 'పార్వతీ' అని పిలిచిరి. ఉ! మా! అని తల్లి తపస్సు వలదనుటచేత పిమ్మట 'ఉమ' అనుపేరు ఆ సుముఖి తాల్చెను. మగబిడ్డల తండ్రియైనను ఆ పర్వతరాజు నెనరుచూడ్కి ఆ యాడుబిడ్డపై నెంతకును తనివిసెందకుండెను. పూవు లెన్నియున్నను మధుమాసమందలి భ్రమరమాల చూతకుసుమమునే అంటిపెట్టుకొనియుండును. మహితప్రభయైన జ్వాలచేత దీపమువలె త్రిపథగానదిచేత త్రిదివమార్గమువలె సంస్కారవతియైన వాక్కుచేత మనీషివలె - ఆ కన్నియచేత తండ్రి పవిత్రుడును అలంకృతుడునయ్యెను.

పసినాడు సఖీమధ్యగతయై క్రీడారసమును జూఱగొనుచున్న దానివలె మందాకినీ సైకత వేదికలయందు కందుకములతో, బొమ్మలతో ఆమె ప్రొద్దులుపుచ్చెను. శరత్సమయము

నందు గంగానదిని హంసమాలలవలె, నిశాసమయమున మహౌషధీలతను నిజప్రకాశములవలె, మేధావినియైన యా దేవిని ఉపదేశ సమయమునందు ప్రాక్తనజన్మవిద్యలు వచ్చి ఆశ్రయించెను.

అంతట - నెమ్మేనికిఁ దొడుగని నగయై మదవిలాసమునకు ఆసవమను పేరులేని సాధనమై కామునకు పుష్పభిన్నమైన అస్త్రమై ఆమెకు ప్రాయమువచ్చెను. కుంచె చిత్తరువును తీర్చిదిద్దినట్లు - అరుణాంశువులు అరవింద ముకుళమును విరియించినట్లు - ఎలప్రాయము ఆమె నెమ్మేను విరియించి అంచులు తీర్చిదిద్దెను.

బొట్టనవ్రేళ్ళ గోళ్ళ కాంతులతో నేలమోపినపుడెల్ల రాగము చిందుచున్న ఆమె చిన్నారి యడుగులు సంచలించు మెట్టకెందామరల బెడంగును పుణికి పుచ్చుకొనెను. అందియల రవళులను ఆచికొనవలెనను ప్రత్యుపదేశలోభము కలవగుటచే రాజహంసలు - ఆ సన్నతాంగిని లీలాంచితన్యాసములైన నెన్నడలలో శిక్షించినవి కావలయును. వృత్తానుపూర్వములు, అనతిదీర్ఘములు శుభలక్షణములునైన ఆదేవి జంఘలను సృజించిన పిమ్మట మిగిలిన అంగకముల నిర్మాణమునకు వలసిన లావణ్యసామగ్రికై విధాత పునఃప్రయత్నము చేసియుండును. నాగేంద్రహస్తములు చర్మకర్కశములు. కదళీవిశేషములు ఏకాంతశీతలములు. రూపపరిణాహసామ్యము నందియు అవి తదూరుయుగళమునకు ఉపమానపదబాహ్యము లయ్యెను. పిమ్మట గిరిశునిచేత అనన్యనారీకమనీయమైన నిజాంకమున

నధిరోపింపబడుటను బట్టియే అనిందితమైన ఆ దేవి కాంచీగుణ స్థాన శోభను ఊహింపవచ్చును.

ఆ తనుమధ్య నెన్నడుముమీఁది వళిత్రయము ఆరోహణార్థమై కామునకు నవయౌవనప్రయుక్త సోపాన పంక్తివలె అమరియుండెను. ఒండొంటి నొరయుచు మృణాలసూత్రమున కేని సందుచాలనియట్లు ఆయుత్పలాక్షి స్తనద్వయము పెంపొందెను. పరాజితుడయ్యును మీనధ్వజుడు హారకంఠపాశములుగ వన్ని యుంచినందున - ఆ దేవి బాహువులు శిరీషపుష్పాధిక సౌకుమార్యములు. ఆమె కంఠము - ముక్తామణిసరము - ఒండొంటికి శోభ నలవరించుచున్నందున భూషణ భూష్యభావము సమానమయ్యెను. చంద్రునిలో నున్నపుడు పద్మగుణానుభవము లేదు. పద్మాశ్రితమైన వేళ చంద్రమశ్శోభానుభవము లేదు. ఉమాముఖము నాశ్రయించిన పిమ్మట లోలమైన లక్ష్మికి ఉభయసంశ్రయప్రీతి అనుభూతమయ్యెను.

తలిరాకుపై పూవు తార్చిననేని
అలరు ముత్యము విద్రుమారూఢమేని
అసలు పోలునో! దేవి యరుణారుణోష్ఠ
విస్ఫురద్ద్యుతిమైన విశదస్మితమ్ము.

ఆ అభిజాతవచన అమృతనిష్యందిస్వరముతో సల్లాపించు వేళ పరభృతస్వరము కూడ విషమనిబద్ధ వీణాతంత్రిని మీటినట్లు వినువారికి వెగటుగొల్పుచుండును. ప్రవాతనీల కువలయ నిర్విశేషమైన బెదరుచూపును ఆ విశాలనయన లేటికన్నియల నుండియే నేర్చెనో! లేటికన్నియలే ఆమెనుండి నేర్చినవో!

కుంచెతో తీర్చిన కాటుకవలె సోగలైన ఆ కనుబొమల విలాస మునుజూచి అనంగుడు స్వచాపసౌందర్యమదము వదలుకొనెను. ఈర్ష్యాగ్రాతులకు సిగ్గు తెలియదు. లేకున్న పర్వతరాజనందన కేశ పాశమును జూచి నిస్సంశయముగ చమరీమృగములు తమతోక కుచ్చుల సొగసుచూచికొని మురిసిపోవుట మానితీరును. విధా తకు-సౌందర్యమంతయు నొక్కచో రాశిపోసి కనులార చూడ వలెనని కాంక్షకలిగినది కాబోలు! యథాప్రదేశ వినివేశితమైన సర్వోపమాద్రవ్య సముచ్చయముతో ప్రయత్నించి ఆమెను నిర్మించెను.

కామచరుడైన నారదు డొకమారు పితృసమీపమున మెలగుచున్న ఆ కన్యనుఁజూచి "ప్రేమచే శరీరార్థము హరించి హరునకు ఏకవధువుకానున్నది" అని ఆదేశించెనట. ఆమాటపై తండ్రి పెండ్లియీడువచ్చినను వరుని వెదుకక యిన్నకుండెను. మంత్రపూతమైన హవ్యమునకు కృశానుడు తక్క అన్యతేజ ములు అర్హములుకావు. అడుగని దేవరను ఆహ్వానించి ఆత్మజ నర్పించుటకు అద్రిరాజు కదలలేకపోయెను. అభ్యర్థనా భంగ భీరువై సజ్జనుడు అభీష్టవిషయమునందైనను తాటస్థ్యమునే అవలంబించును.

ఏనాడు దక్షకృతావమానము వలన ఆ సుదతి తన శరీ రమును యోగాగ్నియందు వేల్చెనో నాటిమొదలు విముక్త సంగుడై పశుపతి పరిగ్రహమొల్లక యుండెను.

కృత్తివాససుడై, నియతాత్ముడైన ఆ శివుడు తపో౽ ర్థమై వచ్చి గంగాప్రవాహపరిధౌతదేవదారుమూలమై

కిన్నరగాన ముఖరితమై - మృగనాభి వలపులు గుబులుకొను చున్న హిమాచలసానువుపై అధివసించెను. సురపొన్నపూవులు అవతంసములుగ దీర్చి ప్రసన్నభూర్జవసనములు దాల్చి మనశ్శిలారాగము మైపూతగొని శైలేయ పరివ్యాప్తములైన శిలాతలములపై ప్రమథు లాసీనులయిరి. మంచుగడ్డలను గిట్టల కొనలతో త్రవ్విపోయుచు, దర్పమధురధ్వనియై, గవయమృగ ములు తనవంక బెదరి బెదరి చూచుచుండగా కైలాసశిఖర సన్నిభ కకుదమైన శివవృషభము సింహగర్జనలు సహింపక 'ఖణిల్లు'మని రంకెవైచెను. ఆ హిమాచల ప్రస్థమునందు తన మూర్త్యంతరమైన అగ్నిని సమిత్సమిద్ధముగ ప్రతిష్ఠించి తపః ఫలములకు తానే విధాతయైయుండియును అష్టమూర్తి ఏ కోరిక చేతనో తప మాచరించెను.

అనర్ఘ్యుడు దేవపరిపూజితుడు నైన ఆమహాదేవుని అద్రి నాథు డర్ఘ్యముతో పూజించి ఏతదారాధనమునకు నియతాత్మ యైన ఆత్మజను సఖీసమేతముగ ఆదేశించెను. సమాధికి ప్రత్యర్థి భూతయైనను ఆమెను శుశ్రూషమాణనుగా గిరిశు డనుమతిం చెను. వికారహేతువున్నను ఎవరి మనస్సులు వికృతినందవో వారే ధీరులు. పూజకు ననలు చిదిమియు అలయక తపోవేదికకు అలుకుపెట్టియు-నియమార్థజలము లాహరించియు-కుశలు సంగ్ర హించియు ఆసుకేశి శివునకు ప్రత్యహము శుశ్రూషసేయుచుండ శివశరశ్చంద్ర కిరణము లామెను సేదదీర్చుచుండెను.

- ఇది ఉమాజననము -

బ్రహ్మసాక్షాత్కారము.

ఆ కాలమునందు తారకునిచేత పీడింపబడిన దేవతలు తురాసాహుని ముందుపెట్టుకొని స్వాయంభువ స్థానమున కరిగిరి. పరిమ్లాన వదనులైన ఆ దేవతలకు సుప్తపద్మములైన సరోవరములకు ప్రాతస్సూర్యుని వలె బ్రహ్మ సాక్షాత్కరించెను. అంత దేవతలందఱు సర్వతోముఖుడు, సర్వవిధాతయు నగు ఆ వాగీశునకు ప్రణమిల్లి అర్థవంతములైన వాక్యములతో ఇట్లు స్తుతించిరి.

సృష్టికి పూర్వము కేవలుడవై పిమ్మట త్రిగుణముల నేర్పరించుటకై భేదమునుపొంది మూఁడుమూర్తులు దాల్చిన నీకు నమస్కారము. ఓ జన్మవిరహితుడా! నీచేత జలములలో అమోఘమైన ఏ బీజము నాటబడినదో దానినుండి చరాచరమైన యీ విశ్వ ముదయించినది. దానికి నీవేకారణము. ఒక్క నీవే మూఁడుదశలచేత నిజమహిమను వెలయించుచు ప్రళయస్థితిసర్గములకు కారణమవైతివి. సృష్టికామముచేత ద్విధాకృతవిగ్రహుడవైన నీ శరీరభాగములు స్త్రీయును పురుషుడునైనవి. ప్రసవభాజియైన యీ సృష్టికి వారే తల్లిదండ్రులు. స్వకాలపరిమాణముచేత విభక్త రాత్రిందివుడవైన నీ స్వాపావబోధములే భూతములకు ప్రళయోదయములు. జగత్కారణుడవైన నీకు కారణము లేదు. జగదంతకుడవైన నీ కంతము లేదు. జగదాదివైన నీకాది లేదు. జగదీశ్వరుడవైన నీకీశ్వరుడు లేదు. ఆత్మను ఆత్మచేతనే తెలిసికొందువు ఆత్మను ఆత్మచే సృష్టింతువు.

కృతకృత్యమైన ఆత్మచేత ఆత్మయందే లీనమగుచుందువు. ద్రవముును సంఘాతకఠినమును నీవ. స్థూలమును సూక్ష్మమును నీవ. లఘువును గురువునునీవ. వ్యక్తమును వ్యక్తేతరమును నీవ.విభూతులయందు నీయిచ్ఛ ననుసరించి యుందువు. ప్రణవము వేనికి మొదలో, వేని యుచ్చారణము స్వరత్రయముచే నియమితమైనదో, వేని ప్రతిపాద్యము యజ్ఞమో, ఫలముస్వర్గమో ఆ వాక్కులకు ప్రభవస్థానము నీవు. పురుషార్థప్రవర్తినియైన ప్రకృతి నీవని చెప్పుదురు. ఆ ప్రకృతిని జూచుచు ఉదాసీనుడైన పురుషుడవును నీవయని తెలియుదురు. శాశ్వతుడవైన నీవ, హవ్యమును హోతవును.భోజ్యమును భోక్తవును. వేద్యము వేదితవును. ధ్యాతవును పరమమైన ధ్యేయమవును.

ఈ రీతిని హృదయంగమములైన యథార్థస్తుతులను వారినుండి విని బ్రహ్మ ప్రసాదాభిముఖుడై దేవతలకు బదులు పలికెను.

ఆ పురాణకవియొక్క చతుర్ముఖములచే సముచ్చరితమై చతుర్విధమైన శబ్దప్రవృత్తి చరితార్థమయ్యెను,

ప్రభావములతో స్వాధికారముల నవలంబించి, కలసి వచ్చిన మహాభుజులు మీకు స్వాగతము! ఇదియేమి? వెనుకటివలె సహజద్యుతిలేక మీ ముఖములు హిమక్లిష్ట ప్రకాశములైన నక్షత్రములవలె నైనవి! అంశువు లణగి సురధనువులు విరజిమ్మని యీ యింద్రుని వజ్రాయుధము అంచులు మణగినట్లున్నదే! అరిదుర్వారమైన యీ వరుణుని చేతిపాశము

మంత్రహతవీర్యమైన ఫణివలె వెతగుడుచుచున్నదే! గదను త్యజించిన యీ కుబేరుని బాహువు కొమ్మవిఱిగిన చెట్టువలె మనశ్శల్యభూతమైన పరాభవము మిన్నకయె చెప్పుచున్నది! అస్తమితజ్వాలమైన దండమున నేల రాయుచు యముడును అమోఘమైనను దీనిని, ఆరిన అలాతమువలె లఘూకరించు చున్నాడు. ఏమీ! ఆదిత్యులావీరు! ఇంత చల్లబడి పోయి రేమి? చిత్రలిఖితులవలె ఆలోకనీయగతికి వచ్చియున్నారు! వెనుకకు నడచుచున్న జలముల పరివాహప్రతిష్టంభము వలె తిరుగుడు పడుచున్న యీ మరుత్తుల వేగభంగము ఊహింప నగుచున్నది. వాలిల్చిన జటాజూటములనుండి వ్రేలాడుచున్న నెలవంకలతో ఈ ఏకాదశరుద్రుల శిరస్సులు హుంకారశూన్య ములై యున్నవి!

లబ్ధప్రతిష్ఠులైన మిమ్ము మీకంటె బలవంతులైన శత్రు వులు విశేషవిధులు సామాన్యవిధులనువలె గదిమికొనిరాయేమి? ఓ వత్సలార! మీరు నన్నేమి కోరవచ్చితిరో? సృష్టినావంతు. పరిపాలనము మీవంతుగదా!

చిఱుగాలికి తమ్మికొలనువలె కదలిన వేయికన్నులతో ఇంద్రుడు బృహస్పతివంక చూచెను. సహస్రనయనాధికమై, ద్వినేత్రమైన యింద్రునిచక్షువు, ఆవాచస్పతి ప్రాంజలియై జల జాసనున కిట్లు పలికెను.

స్వామీ! మీరేమియనిరో అట్లే జరిగినది. మాయధి కారము శత్రువులు ఆక్రమించికొనిరి. సర్వ హృదయస్థితుడవైన నీకు తెలియరానిదేమి?

నీవిచ్చిన వరముతో ఉద్ధతుఁడై తారకుఁడను మహాసురుఁడు జగదుపద్రవమునకు తోకచుక్కవలె పొడిచెను. వాని నగరములో దీర్ఘికా కమలములు విచ్చుట కెంతవలయునో, సూర్యుఁడంతయెండయే కాయుచున్నాఁడు. సర్వవేళల సర్వకళలతో చంద్రుఁడు వానినే సేవించుచున్నాఁడు. హరచూడామణీకృతమైన ఆ ఒక్కకళనే తీసికొనుట లేదు. పూల దొంగతనమునకు వెఱచి యుద్యానము దిక్కు నడునక వానిపార్శ్వమునందు గాలి వీవనలకు మించి వీచుట లేదు. పర్యాయసేవ విడిచి పుష్పసంభారతత్పరములై, ఉద్యానపాలురతో సమానముగ ఋతువులు వానిని సేవించుచున్నవి. వానికానుకకు యోగ్యములైన రత్నములు నిష్పన్నము లగునంతవఱకు అంభోమధ్యమున వ్యగ్రుఁడై సరిత్పతి ప్రతీక్షించుచుండును. వాసుకిప్రముఖ భుజగరాజులు జ్వలన్మణిశిఖలతో నడిరేయి స్థిరప్రదీపభావము నంది వానిని పర్యుపాసించుచున్నారు. వానిదయకు మోమువాచి మాటిమాటికి దూతహారితములైన కల్పద్రుమవిభూషణములతో ఇంద్రుఁడుకూడ వానిని అనుకూలము చేసికొనుచున్నాఁడు. ఇట్లు రవి, శశి, పవన, జలధి, భుజగ, సురరాజులు సేవించుచున్నను వాఁడు భువనత్రయమును పీడించుచున్నాఁడు. దుర్జనుఁడు ప్రత్యపకారముచేత శమించునుగాని ఉపకారముచేత మాలిమికాఁడు. అమరవధువు లల్లన కొమ్మలువంచి నెనరుమై తలిరులుకోయు నందనద్రుమములు వానిచేత ఛేదపాతములకు అభిజ్ఞము లగుచున్నవి. వాఁడు నిద్రించినపుడు బందీకృత సురసుందరులు

979

బాష్పశీకరములను జిందుచు నిశ్వాససాధారణానిలములైన వింజామరలతో వీచుచుందురు. సూర్యాశ్వ ఖురక్షుణ్ణములైన మేరుశృంగములను పెళ్ళగించి వాడు తన భవనములయందు క్రీడాపర్వతములు కల్పించెను. మందాకినీనదిలో దిగ్వారణ మదావిలమైన జలముమాత్రమే శేషించియున్నది. ఇప్పుడు హేమాంభోరుహసస్యములకు వానిదీర్ఘికలే నెలవు. వాని సంపాతభయమువలన విమానపథము పాడుపడిపోయినది. దేవతలు భువనాలోకనప్రీతి ననుభవించుట లేదు. యజ్వలచేత మాకై యజ్ఞములలో సంభృతమైనహవ్యమును మేము చూచుచుండగనే వహ్నిముఖమునుండి ఆ మాయావి తన్నికొని పోవుచున్నాడు.

ఉన్నతమైన ఉచ్చైశ్శ్రవోనామ హయరత్నము ఇంద్రుని సశరీరమైన చిరకాలార్జిత యశస్సువలెవానిచే అపహృతమైనది. క్రూరుడైన వానిపట్ల మా ఉపాయములన్నియును సన్నిపాత జ్వరములో నౌషధములవలె విఫలప్రయోగములైనవి. ప్రతి ప్రహారమున జ్వాల లెగజిమ్ముచు మా జయాశకు నెలవై యున్న హరిసుదర్శనము వాని కంఠార్పితభూషణమైనది.

నిర్జితైరావణములైన వానియేనుగులిపుడు పుష్కలావర్తక మేఘములలో కోరాడుచున్నవి.

స్వామీ! అందువలన మేము సంసారోపశాంతికై ముముక్షువులు కర్మబంధచ్ఛేదియైన ధర్మమును కోరునట్లు ఆ తారకుని వినాశనమునకై సేనానిని సృష్టింపగోరుచున్నాము.

సురసైన్యగోప్తయైన అతనిని ముందుంచుకొని గోత్రవైరి బందీకృతస్త్రీనివలె శత్రువులనుండి జయలక్ష్మిని ప్రత్యానీత నొనర్పగలడు.

ఆ గీష్పతివచస్సు ముగిసినంతనే గిరాంపతి వాక్కును వెలువరించెను. అది సౌభాగ్యలక్షణముచేత గర్జితానంతర ప్రవృత్తమైన వృష్టిని క్రిందొనరించెను.

ఈ మీ మనోరథము చేరిక కాగలదు. కొంతకాలము ప్రతీక్షింప నగును. ఏమన ఈ కార్యసిద్ధికై నేను సృష్టికి పూనికొనను. నావలన అభ్యుదయమునందిన ఆ దైత్యునకు నావలననే వినాశము తగియుండదు. విషవృక్షమైనను చేతులార పెంచి నరుకరాదు. మొదలనే వాఁడు నన్నిది కోరెను. నేనును వానికిది ప్రతిశ్రుత మొనరించితిని. లోకములను దహింపనున్న వానితపస్సు వరముచేత నేకదా శమింపబడినది.

సంయుగములో ఆ సాంయుగీనుని ఓర్వగలవాడెవ్వడు? ఒక్క నీలలోహిత తేజస్సంభవుడు దక్క? ఆ దేవుడు తమః పారమున ప్రతిష్ఠితమైన పరంజ్యోతి! నాచేతగాని విష్ణువుచేత గాని తన్మహిమము నిర్ణయింపబడలేదు. ఉమాసౌందర్యముచేత మీరు సమాధినిశ్చలమైన శంభునిమనస్సును అయస్కాంతము చేత లోహమునువలె ఆకర్షించుటకు ప్రయత్నింపుడు. శంభుని తేజము ఆ ఉమయే వహింపగలదు. నాతేజము ఆ శంభుని జల మయమూర్తియే వహింపగలదు. ఆశితికంఠుని ఆత్మజుడు సేనా

పతిత్వమును వహించి తన శౌర్యసంపదలచేత బందీకృతసుర స్త్రీల వేణులను విడిపింపగలడు.

విశ్వవిధాత విబుధులతో నిట్లుపలికి అంతర్హితుం డయ్యెను. మనస్సునందు కర్తవ్యమును నిలిపి, వారును స్వర్గమునకు మఱలివచ్చిరి. ఇంద్రుడు కార్యమున నిశ్చయించి - కార్యసంసిద్ధిత్వరా ద్విగుణీకృత వేగమైన మనస్సుతో మన్మథుని తలంచెను.

అంతట లలితవనితా భ్రూలతా మనోహరశృంగమైన పూవిల్లు రతి కంకణపదాంకితమైన కంఠము నందమరించికొని సహచర మధుహస్తన్యస్తములైన చూతాంకురాస్త్రములతో ప్రాంజలియై పుష్పధన్వుడు శతమఖుని జేరవచ్చెను.

మఘువుని వేయికన్నులు - త్రిదశులను విడిచి ఆ పుష్ప ధన్వునిపై ఒక్కసారిగ వ్రాలెను. ప్రయోజనాపేక్షులగు ప్రభువుల మన్నన ఆశ్రితులయెడ నిలుకడలేక యుండును.

"ఇచట కూర్చుండుము!" అని ఆసనసమీప నిర్దేశపురస్సరముగ వాసవుడు మన్నింప- మదనుడు భర్తృప్రసాదమును శిరసా ప్రత్యభినందించి ఏకతముండి యిట్లనెను.

పురుషుల విశేషమును నీవెఱుఁగుదువు. నన్ను పనిగొనుము. లోకములలో నీకు కరణీయ మేమికలదో! సంస్మరణ ప్రవృత్తమైన యీ అనుగ్రహమును ఆజ్ఞతో వర్ధిల్లజేయ గోరుదును.

స్వారాజ్య పదకాంక్షియై ఎవ్వడుగాని - సుదీర్ఘ తపములకు దొడఁగి నీ కలుకయొ త్తించెనో! వాడు - ఆహితసాయకమైన నా ధనుర్నిర్దేశపరిధిలో నున్నవాడు. పునర్భవ క్లేశభీతి వలన నీకసమ్మతుడయి యెవ్వడుగాని ముక్తిమార్గమున అడుగిడెనో! వాడు పర్యాయవివర్తిత భ్రూనిర్గతములైన సుందరీ కటాక్షములచేత బద్ధుడై పడియుండుగాక. ఉశనసుడైన నీతిశాస్త్రమును గఱపియుండనిమ్ము - నారాగప్రణిధిని పంపి ఆ నీశత్రువెవ్వడో వాని అర్థధర్మములను - నదీతటములను విరిసిన వెల్లివోలె కూలద్రోయుదునో! చెలువమున లోలమగు నీ మనసున ప్రవేశించిన ఏకపత్నీవ్రత దుఃఖశీలయగు వనితంబనిని గాని - విముక్తలజ్జయై నీకంఠమున స్వయంగ్రాహ నిషక్త

బాహువుగ అభిలషించుచుంటివో-! ఓననుపుకాడ ! సురతాప
రాధమున పాదానతుడవైన నిన్ను ఏకోపనగాని విదలించెనో !
ఆమెశరీరము గాఢానుతాపమున ప్రవాళ శయ్యాశరణ మగు
నట్లు చేసెదను. మహావీరా ! మన్ననఁ జూడుము. వజ్రమును
నుంత విశ్రమింపనిమ్ము. నాశరములచేత ఏసురవైరియైనగానీ
మోఘీకృతబాహువీర్యుడై కోపస్ఫురితాధరలైన స్త్రీలకుగూడ
వెఱచుచుండవలసినదే. నీ యనుగ్రహమువలన కుసుమాయు
ధుడనయ్యు - ఈపూవులనెల సాయమొక్కటి గైకొని పినాక
పాణియగు హరుని ధైర్యమునైన తూలింతును. పెఱవిలు
కాండ్రు నాకెంత !

అంతట ఊరుతలముపైనున్న పాదమును అల్లన దించి
పాదపీఠముపై మన్ననగా మోపి తన మనసులో నున్నదానికి
సరితాకునట్లు నిజశక్తి వెల్లడించియున్న కామునకు ఆఖండలు
డిట్లనెను.

ఓ చెలికాడా! ఇదియెల్ల నీయెడల పొసగును. నాయస్త్ర
ములు రెండు. కులిశమును నీవును. వజ్రము తపోవీర్యమహితుల
యెడ మొక్కవోవును. నీవను అస్త్రము సర్వతోగామియైన
సాధకము. నీసార మెఱుగుదును. కావున నే ఆత్మసమునిగ నిన్నీ
మహాకార్యమున నియోగింపబూనుట; భూభరణక్షమ సార
మును జూచియేకదా విష్ణువు శేషుని స్వదేహోద్వహనార్థము
ఆదేశించుట !

వృషాంకునిపై శరప్రసారమును ఆశంసించుచున్న నీచేత మాహాత్మ్యము అంగీకృతప్రాయమని తెలియును. ఇప్పుడు బలవద్ద్విషులైన యీ యజ్ఞాంశభుజుల యీప్సిత మిదియే. ఈ దేవతలు శత్రువిజయార్థము భవుని తేజఃప్రభవుడైన వానిని సేనానిగ అభిలషించుచున్నారు. ఆ భవుడో! కృతమంత్రిన్యాసుడై బ్రహ్మానుసంధానమున నుండి - ఒక్క నీ యిషునిపాతము చేతనే సాధింపదగియున్నవాడు. ఆ నియతాత్మునకు నియతాత్మయైన హిమాచలరాజతనూజను రుచింపఁజేయుటకు యత్నింపుము. స్త్రీలలో ఆ పరమశివ తేజమును భరింప సమర్థురాలామె యేనని బ్రహ్మ యుపదేశించెను. ఆ నగేంద్రకన్యయును పిత్రు నియోగమున అధిత్యకపై తపమాచరించుచున్న స్థాణువును సేవించుచున్నదని అప్సరోముఖమున వింటిని. ఆ యప్సరోవర్గము నాప్రణిధి.

అందున-కార్యసిద్ధికయి నీవుపొమ్ము. దేవకార్య మాచరింపుము. ఈయర్థము అర్థాంతర భావియే. కాని అంకురము బీజమునుండి యుద్గమించుటకు ముందు జలమునువలె నిన్ను చరమ కారణముగ అపేక్షించుచున్నది. సురవిజయోపాయభూతుడైన ఆ హరునిపై శరసంధానము చేయజాలినవాడవు నీవొక్కడవే. నీవు ధన్యుడవు. అలతియైనను అనన్యసాధారణమైన కార్యమే పురుషులకు కీర్తికారణము. అభ్యర్థులా! దేవతలు. కార్యమా! త్రిలోకములది. నీపనియా! పుష్పధనువుతో. అదియును అంత హింసాకరముగాదు. అహో! స్పృహణీయవిక్రముడవు సుమీ!

979

ఈ వసంతుడును సాహచర్యమువలన ఒకరుచెప్పకయే నీకు సహాయు డగును. సమీరణునితో "నీవగ్నికి తోడుకమ్మని" ఎవరు చెప్పవలయును ?

'సరి'-అని స్వామియాజ్ఞ ప్రసాదకుసుమమాలవలె శిరసా గ్రహించి మదనుడు కదలెను. ఐరావణాస్ఫాలన కర్కశమైన హస్తముతో ఇంద్రు డాతని శరీరమును స్పృశించెను.

ప్రియసఖుడైన మాధవునితో, కళవళపడుచున్న రతితో అనుప్రయాతుడై -శరీరమును కోల్పడియైన కార్యసిద్ధి నర్థించి మదనుడు హైమవతమైన స్థాణ్వాశ్రమమును చేరనేగెను. ఆ స్థాణువనమునందలి సంయములైన మునుల తపస్సమాధికి ప్రతికూలవర్తనుడై వసంతుడు సంకల్పభవునకు అభిమానభూతమైన స్వస్వరూపమున ప్రవేశించి విజృంభించెను.

సమయభంగ మొనరించి - ఉష్ణరశ్మి కుబేరపరిపాలితమైన దిశను జేరబోవునంత దక్షిణాశావధూముఖమున దుఃఖనిశ్వాసమువలె గంధానిలము నిగిడెను.

అప్పటికప్పుడే అశోకము కాండము మొదలుకొని సపల్లవములైన కుసుమములు తొడిగెను. ఆశింజితనూపురమైన సుందరీచరణసంస్పర్శభోగము నపేక్షింపలేదు. చిగురుగఱులతో క్రొమ్మావి పూదూపు రూపొందించి వలరాజు నామాక్షరములను ముద్రించినట్లు-ఆమని అచట ఎలదేటులను నెలకొలిపెను. ఎంత వర్ణప్రకర్షయున్నను కర్ణికారము నిర్గంధమగుటచే మనస్సు చివుక్కుమనిపించెను. గుణసామగ్ర్యవిధావ

మున విశ్వవిధాతయొక్క ప్రవృత్తి సాధారణముగ పరాఙ్ముఖి. అరవిచ్చుకొనమి నెలవంకలవోలెనున్న యెఱ్ఱని మోదుగలు వసంత సమాగతలైన స్థలీదేవతల సద్యో నఖక్షతములవలె నెత్తురు చిమ్మెను. అంటిన మెలదేటి కాటుక రేక తీర్పుతో మోముపయి చిత్రముగ - తిలకమును వెలయించి బాలారుణకోమలమైనరాగముతో మధులక్ష్మి చూతప్రవాళాధరము నలంకరించికొనెను. మదోద్ధతములై మృగములు ప్రియాళుద్రుమమంజరీ రజఃకణములు చెదరి, కండ్లలోఁబడి అంధీభూతములై - పారుటాకుల మర్మరధ్వనులకు బెదరి - ఎదురుగాలిలో వనస్థలులయందు పరువులుపెట్టెను. ఎలమావి చిగురుల వగరాని-జీర తెగిన యెలుగుతో పొగరూని మగకోయిల - కోసలు మారుమ్రోగునట్లు కొసరికొసరి ఏచికిలి కూహుకుహూవు విసరెనో, అదియే మనస్వినుల మనసుల లోని బిగువుసడలించు మనసిజదేవుని మాటగ మారిపోయెను. మంచు విచ్చుటచే విశదాధరలును ఆపాండురీభూత ముఖద్యుతులు నైన కింపురుషాంగనల పత్రరచనలయందు చెమర్పు మొదలయ్యెను. స్థాణువనవాసులైన తపస్వులు - ఆకస్మికమైన ఆ వసంతాగమము చూచి ప్రయత్న సంస్తంభిత వికారములైన తమ మనస్సులను - ఎట్లెట్లో నిలువరించికొనజాలిరి.

మోపెత్తించిన పూలవిల్లుతో రతిద్వితీయుడై మదనదేవుడాప్రదేశమును చేరవచ్చినంతనే వివశములై ద్వంద్వములుకోటి

కెక్కిన ప్రేమరసముతో బెరసి మాటలకు రాని భావమును చేష్టచే వెలువరించినవి.

ద్విరేఫము తనప్రేయసి వెన్నంటి తిరుగుచు కుసుమైక పాత్రమునందు తేనెలానెను. కృష్ణసారము- స్పర్శనిమీలితాక్షి యగుచున్న నిజవధువును కొనకొమ్ముతో కండూయన మొనరించెను. తమ్మి పుప్పొడివలపుతో కసటెక్కిన పుక్కిటినీటిని మక్కువతో పిడియేనుగు మగయేనుగున కందిచ్చెను. జక్కవ సగము నమలిన తామరతూటితునకతో ఇల్లాలిని మన్నించెను. కింపురుషుడు చెమరుమొగ్గలు తొడిగియించుక కరగినపత్రలేఖలతో చెలువొలుకుచు-పుష్పాసవాసేవనమున తిరుగుడుపడుచున్న కన్నులతో ఇంపునింపుచున్న ప్రేయసీముఖమును గీతాంతరాళముల ముద్దుగొనెను. పర్యాప్తపుష్పస్తబక భారానతలును, స్ఫురత్ప్రవాళాధర మనోహరలునైన లతావధువుల వినమ్ర శాఖా భుజబంధనములను తరువులుగూడఁ జూఱగొనినవి.

ఆ క్షణమునందు అప్సరోగీతి చెవుల బడుచున్నను హరుడు ధ్యానపరుడయ్యెను. ఆత్మనియంతలకు విఘ్నము లెన్నఁడు సమాధిభంగ మొనరింపజాలవు.

అంతట వామప్రకోష్ఠార్పిత హేమవేత్రుడై లతా గృహద్వారమున నిలిచి - నందీశ్వరుడు ముఖమున గదియించి కొనిన తర్జనీసంజ్ఞచేతనే చాపలము వలదని ప్రమథులను శిక్షించుచుండెను.

కదలనిచెట్లు - ఊలియని తేటి - కూయనిపులుగు - మెదలని మృగము నయి ఆయడవి యంతయు ఆ నందీశ్వరాజ్ఞ చేత చిత్తరువున వ్రాసినట్లుండెను.

కాముడు ప్రియమున - ఎదురుచుక్కనువలె - ఆతని దృష్టిపాతమును పరిహరించి పార్శ్వములలో సురపొన్నకొమ్మలు క్రమ్మికొనియున్న భూతపతియొక్క ధ్యానప్రదేశము ప్రవేశించెను. సమాసన్నమృత్యువైన ఆమదనుడు పులితోలు పఱచియున్న దేవదారుద్రుమ మూలవేదికయందు ఆసీనుడై సమాధినిష్ఠుడై యున్న త్రియంబకుని చూచెను.

పర్యంకబంధస్థిరమైన శరీరోత్తరార్థము ఋజుదీర్ఘముగనున్నది. మూపులు రెండు సన్నమితములై యున్నవి. అంకమధ్యమున ఉత్తానపాణిద్వయ సన్నివేశము నెత్తమ్మిలు విరిసినట్లున్నది. జటాకలాపము భుజంగముచేత ఉన్నద్ధమైయున్నది. అక్షమాల రెండుపేటలుగ కర్ణమున వ్రేలుచున్నది. కృష్ణాజినగ్రంథి కంఠప్రభాసంగ విశేషనీలమై యున్నది. ఈషత్ప్రకాశములు నిశ్చలములు, భయంకరములైన కనీనికలతో భ్రూవిక్షేపమొనరింపక - అవిస్పందిత పక్ష్మమాలములై అధోమయూఖములైన నేత్రములచేత లక్షీకృతఘ్రాణుడై యుండెను. అంతశ్చరములైన ప్రాణములను నిరోధించుటవలన వృష్టిసంరంభము లేని మేఘమును! అనుత్తరంగమైన అపాంనిధానము! నివాతనిష్కంపమైన ప్రదీపము. కపాలనేత్రాంతర లబ్ధప్రసారములై శిరస్సునుండి వెలికుఱుకు జ్యోతిః ప్రరోహములచే మృణాళసూత్రాధిక

సౌకుమార్యప్రాయమైన బాలేందు రేఖను కమలించుచుండెను. నవద్వారములనుండి నివర్తితసంచారమై సమాధిచేత వశంగతిమైన మనస్సును హృదయమునందు నిలిపి - ఎవ్వానిని క్షేత్రవిదులు అక్షరునిగ దెలియుదురో ఆ ఆత్మను తనయందు అవలోకించుచుండెను.

తథాభూతుడై మనస్సునకైన చెనకరాకయున్న ఆ అయుగ్మనేత్రుని-చేరువనుండి చూచుచు సాధ్వసవిశ్లథపాణియై స్మరుడు స్వహస్తమునుండి జాఱినశరమును చాపమును గూడ గమనింపడయ్యెను.

అంతట నిర్వాణప్రాయమైన యీస్మరుని తేజమును తన సౌందర్యముచేత పునరుజ్జీవింపఁ జేయుచున్నదానివలె వనదేవతానుప్రయాతయై స్థావరరాజకన్య కననయ్యెను.

అవధీరితపద్మరాగములైన అశోకములు, ఆహృతస్వర్ణవర్ణములైన కర్ణికారములు, ముక్తాకలాపీకృతసిందువారములు, వసంతపుష్పమయమైన ఆభరణభాండము నామె వహించియుండెను. ఈషదానమితయై, తరుణార్కరాగ పరిధానము దాల్చి పర్యాప్త పుష్పస్తబకావనమ్రయు పల్లవితయునైన సంచారిణీ లతవలె నుండెను. స్థానవిదుడైన స్మరుడు న్యాసముంచిన పుష్పధనువుయొక్క ద్వితీయమౌర్వివలె నితంబబింబమునుండి జాఱుచున్న వకుళమాలామేఖలను కేలనూది అలవరించికొనుచుండెను. సుగంధి నిశ్వాసములకు మరులుగొని బింబాధరము

చేరువ, మలయము మన్న తేటిని ప్రతిక్షణము సంభ్రమలోల దృష్టియై లీలారవిందముతో నివారించుచుండెను.

సర్వావయవానవద్యయై రతిదేవికైన లజ్జాపదము నావహింపఁజేయుచున్న ఆ పార్వతినిజూచి పుష్పధన్వుడు జితేంద్రియుడైన శూలియెడ స్వకార్యసిద్ధిని తిరిగి ఆశంసించెను.

ఉమ - పతికాఁబోవుచున్న శంభుని ప్రతిహారభూమి చేరుకొనెను.

శంభుడును - లోన పరమాత్మసంజ్ఞమైన పరంజ్యోతిని చూచి యోగమునుండి ఉపరతుడయ్యెను.

అంతట రసాతలమున ఫణిరాజు తన ఫణాగ్రము లొడ్డికొని - ఎట్టెట్లో క్రింది భూమిభాగము మోయుచుండ - అల్లనల్లన - ప్రాణముల నిరోధమునుడిపి ఈశ్వరుడు నిబిడమైన పర్యంకబంధము సడలించెను.

ఆ పరమేశ్వరునకు ప్రణమిల్లి నంది శుశ్రూషార్థమై శైలసుత వచ్చియున్నదని నివేదించి, స్వామి భ్రూక్షేపమాత్రానుమతమున ఆమెను ప్రవేశపెట్టెను. ఆమె సఖులు స్వహస్తావచితమైన పల్లవభంగమిశ్రమగు వసంతపుష్పోచ్చయము ను ప్రణిపాతపూర్వముగ శివ పాదమూలమున విరజిమ్మిరి.

ఉమయును - నీలాలకమధ్యశోభమానమైన నవకర్ణికారము జాఱుచుండ కర్ణచ్యుతపల్లవమైన శిరస్సుతో వృషభధ్వజునకు ప్రణమిల్లెను. అనన్యభాజుడైన పతిని పొందుమని ఆమెను

గూర్చి భవుడు తథ్యమె పలికెను. ఏమన ఈశ్వరోక్తులకెన్న డును లోకమున విపరీతార్థములు గలుగవు.

కాముడు - బాణప్రయోగసమయమును వేచి వహ్ని ముఖమున ప్రవేశింప మలయుచున్న శలభమువోలె - ఉమా సమక్షమున హరబద్ధలక్ష్యుడై మాటిమాటికి వింటినారి సవ రించుకొనుచుండెను.

అంతట గౌరి తపస్వియైన గిరిశునకు కెంగేల రవికిరణ విశోషితమైన మందాకినీ పుష్కరబీజమాలను సమర్పించెను.

ప్రణయిప్రియుడగు త్రిలోచనుడామాల ప్రతిగ్రహిం చుట కుపక్రమించెను. పుష్పధన్వుడు సమ్మోహనమను ప్రసిద్ధ మైన అమోఘశరము వింటదొడగెను.

చంద్రోదయారంభవేళ - అంబురాశివలె శివుడు ఇంచుకతొణికి ఉమా బింబఫలాధరోష్ఠమును సాభిలాషముగా వీక్షించెను.

మొగ్గదొడుగుచున్న బాలకదంబ శాఖలవలె నైన అంగకము లతో శైలసుతకూడ భావమును వెలువరించుచు పర్యస్తవిలో చనమై చారుతరమైన మోము నోరగ ద్రిప్పి నిలిచెను.

అంత త్రినేత్రుడు వశిత్వమువలన బలిమిమై ఇంద్రియ క్షోభము నిగ్రహించి స్వచేతోవికారకారణ మరయదలచి దిశోపాంతములయందు దృష్టిని ప్రసారించెను.

దక్షిణాపాంగ నివిష్టముష్టితో, నతాంసుడై, వామచర ణమును కుంచించి, మండలీకృత పుష్పకోదండుడై ప్రహరణో ద్యతుడైన ఆత్మభవుని శివుడు చూచెను.

తపస్సు చెనకినందున మహోగ్రహము వహించి భ్రూభంగ దుర్నిరీక్షముఖుడైన ఆ హరుని మూడవకంటి నుండి ఉద్దీప్యమానమై ఉదర్చియైన కృశాను వపుడు నిర్గమించెనట!

'ప్రభూ! క్రోధము మరలింపుము. మరలింపుము' అని మరుత్తుల మెలుఁగులు ఆకసమున మ్రోయునంతలోనే భవనేత్రజన్మమైన యీవహ్ని మదనుని భస్మరాశిగ మిగిల్చెను.

తీవ్రాభిషంగ ప్రభవమై ఇంద్రియవృత్తిని సంస్తంభింప జేయుచు క్రమ్మిన మూర్ఛ భర్తృవ్యసనము నెఱుగనీయక ఒక ముహూర్తకాలము రతిదేవికి ఉపకారము చేసినట్లుండెను.

తపస్వియైన భూతపతి ఆ తపోవిఘ్నమును శీఘ్రముగ పిడుగు వృక్షమునువలె అడఁచి స్త్రీసన్నికర్షమును పరిహరింప గోరుచు భూతములతో అంతర్థానొందెను.

శైలాత్మజయును మహోన్నతుడైన తండ్రి యభిలాషము లలితమైన తనరూపమును వ్యర్థమయ్యెనని విచారించి సఖుల సమక్షమున అధిక సంజాతలజ్జయై శూన్యయై ఎట్టెట్టో భవనాభిముఖముగ నడచెను.

అప్పుడు - హిమాద్రి రుద్రసంరంభ భీతిచేత ముకుళితాక్షియై అనుకంపనీయయగు బిడ్డను తన బాహువులతో నెత్తికొని దంతలగ్నమైన పద్మినిని వహించిన సురగజమువోలె వేగదీర్ఘీకృతాంగుడై మార్గానుసారగతి యయ్యెను.

రతి ప్రతిపాలనము

అంతట; మోహనిలీనయై వివశయైయున్న కామవధువు దుర్భర వేదనమైన నవవైధవ్యమును అనుభవింపజేయుటకై విధి చేత మేలుకొలుపఁబడెను. ప్రళయాంతమున ఉన్మీలితములైన విలోచనములను ఆమె నిలుకడపొందించి చూచెను. కాని తనివి పడకున్న ఆ కన్నులకు ప్రియదర్శనము శాశ్వతముగ విలుప్త మయ్యెనని యెఱుఁగక పోయెను.

'ఓయి జీవితనాథ! జీవించియున్నావా!' అని లేచినిలిచిన ఆమెకు - ఎదుట పురుషాకారమైన హరకోపానల భస్మరాశి యొక్కటియె కానవచ్చెను. అంతట; ఆమె మఱల విహ్వలయై భూమినిపొదివికొని ధూళిధూసరిత దేహయై విరియఁబాఱిన కేశములతో భూమిగుండె యవియునట్లు పనవి పనవి యేడ్చెను.

లోకములలోని సౌందర్యమునకెల్ల నుపమానభూమియై యున్న నీమేనిసోయగము ఈ దృశదశకు వచ్చినది. నేనేల ప్రీలి పోనో! కఠినలుగదా! స్త్రీలు.

ఒక్కక్షణములో సౌహార్ద సేతువును ద్రెంచికొని జల ప్రవాహము నళినిని వలె నీపయి ప్రాణములు పఱచికొని యున్న నన్ను విరజిమ్మి - ఎచ్చటికి తరలిపోయితివో! ఎన్నఁడు నాకు విప్రియముచేసి యెఱుగవు. నేనును నీకు ప్రతికూలము చేసి యెఱుగను. మఱి ఇట్లు నీకై అడలిపోవుచున్న నీరతికి నీవేల కానరావు! ఓయిస్మర! నీవు పేరుజాఱిన వేళల నిన్ను

నామేఖలతో బంధించితిని. పుష్పోదులోలికి కంట నీరుగ్రమ్ము నట్లు కర్ణోత్పలముతో ప్రహరించితిని అవి గాని స్మరియించి నన్నిట్లలయించుటలేదుగదా! 'ఎప్పుడు నాహృదయమునందె వసించి యున్నావ'ని నాకుప్రియము కలుగునట్లు నీ వన్న ఆనాటిమాట కైతవ మనిపించుచున్నది. అది ఉపచారపదము – కానియెడల నీవు అనంగుడవై రతియెట్లు అక్షతయై యున్నది ?

పరలోక నవప్రవాసివైన నీవెంటబడి నేనెట్లును వత్తును. కాని ఈలోకమే దైవముచేత వంచింపబడినది. భవదధీనమెకదా శరీరులసుఖము ! రజనీ తిమిరావకుంఠితమైన పురమార్గమునందు ఘనశబ్దవిక్లబలైన ప్రేయసీజనమును ప్రియులవసతి చేర్చుటకు నీకంటె దిక్కెవ్వరు! ఎఱ్ఱవాఱిన కన్నులను ఘూర్ణిల జేయుచు మాటి మాటికి మాటలను తొట్రిలజేయుచు వారుణీ మదము నీవు లేనందున ప్రమదలకిప్పుడు విడంబన. పోరాని చుట్టమవైన నీనెమ్మేనియందము కథయైపోయినదని తెలిసి నిష్ఫలోదయుడైన చంద్రుడు బహులపక్షాంతమున గూడ నలంత మానజాలడు. ఆకుపచ్చని యెఱ్ఱని తొడిమపట్టుతో కోయిలయెలుగులోని తీపులను తన వెనువెంటనే తలపునకు తెచ్చు క్రొమ్మామిపూవు నేడింక నెవ్వరికి బాణముకాగలదో చెప్పుము ! పలుమారు నీవు వింటికినారిగ నలవరించిన యీ యెలదేటిదాటు; జాలియెలుగుల యులివుతో గుండెబరువయి యడలుచున్న నన్ననుసరించి రోదించుచున్నట్లున్నది.

మరల ఒకసారి సాగయించు ఆ నీమేను గైకొని నిలిచి తీయని మాటలకు కాణాచియైన కోయిలను రతిదూతీపదముల యందు నియోగింపుము.

ఆ యూాదలయొగ్గి వేడికొనుట్లలు, ఆ సవేపథు పరిష్వం గములు ఆ యేకతములు ఆ పెనకువలు తలచి నాకు శాంతి లేదు. ఓయి ప్రేగల్భుడ! నీవు నామేన స్వయముగ కై సేసిన యీ వాసంత కుసుమప్రసాధనము నా యంగకముల నిలిచియే యున్నది. ఆ నీమనోహరమూర్తియే కానరాదు. క్రూరులైన విబుధులు ఏ చరణాలంకరణము సమాప్తినొందకయె నిన్ను తలచిరో ఆ యీ దక్షిణేతర చరణమున లాక్ష నద్దుదువుగాని రమ్ము! నేను వహ్నిమార్గమున వచ్చి మఱల నీయంక మధిరో హింతును. జాణలైన యచ్చరలు ఆ స్వర్గములో నిన్ను మభ్య పెట్టుదురేమొ! ఓ నామనోరమణ! నిన్ననుసరించి ఎట్లును వత్తును. కాని "మదనుని బాసి రతి క్షణమైనను జీవించియున్న" దను ఈ యాడికమాత్రము నాకు మాయదుసుమా!

పరలోకగతుడవైన నీకు చరమాలంకరణమైన చేయు టెట్లు? ప్రాణితో మేనితోగూడ ఒక్కసారియే అనూహిత మైన గతిని పొందితివి. ఒడియందు విల్లు వ్రాల్చికొని తూపు సవరించుచు వసంతునితో ఆ నీసస్మితాలాపము, కడగంట

చూచిన ఆచూపు, నాకన్నులలో వేగిలుచున్నది. నీకు హృద యంగముడైన ప్రాణసఖుడు పూవులవిల్లు పన్నియిచ్చిన ఆ వసంతు డెచ్చటనో! ఉగ్రరోషుడైన పినాకి అతనినిగూడ సుహృద్గతమైన గతికి పంపలేదుగదా.

అంతట, ఆ పలుకులలోని ఒక్కొక్క యక్షరము విష లిప్త బాణమువలె డెందమున నాటుకొనుచుండ అవటిల్లిన రతిని ఊరార్చుటకు ఆమని ఆమె యెదుటఁబడెను. అతనిని చూచినంతనే ఆమె ఱొమ్ముబాదికొనుచు మరింత యేడ్చెను. అయినవారియెదుట దుఃఖము తలుపులు తీసికొని వెలికుఱుకును.

ఏడ్చియేడ్చి ఇట్లనెను. ఓయి వసంతుడ! చూడుము. నీ చెలికాని కేమిమిగిలెనో! పావురపు వన్నియమైన ఆ యీ బూది నైన మిగుల్పక రేణువు రేణువుగ అనిలము లపహరించు చున్నవి.

ఓయి స్మరుడ! ఇప్పుడైన దర్శనమిమ్ము. ఈ వసంతుడు నీకయి దిగులుపడియున్నాడు. ప్రియులపైనయినను నిలుకడ మాలియుండును గాని నెచ్చెలులపయి ప్రేమమాత్రము చలిం పదు. ఇతడేగదా! పజ్జనిలిచి బిసతంతుగుణము, పేలవపుష్ప శరము నయిన నీవింటియానను చేతనాచేతనమయిన సర్వజగము చేత శిరసావహింపఁజేసినది!

ఓ వసంత ! నీ ప్రాణసఖుఁడు అనిలాహతమైన దీపమువలె మఱలిరాఁడు. మోయలేని దుఃఖభరముతో పొగక్రిమ్ముకొని యున్న ఆ దీపపువత్తిని నన్ను చూడుము. అమనీ ! కామ వధలో నన్ను మిగిల్చి విధి అర్ధవైశస మొనరించెనుసుమా! అన పాయమని నమ్మియున్న ఆశ్రియవృక్షమును ఏనుఁగు కూల ద్రోయఁగా అల్లికొనిన వల్లరియు నేలకు వ్రాలియేపోవును.

కావున నీవు ఈ బంధుజనకృత్యము చేసిపెట్టవలయును. విధురనైన నాకగ్నియిచ్చి పతిసమీపమునఁ జేర్పుము.

వెన్నెల జాబిలితోనే యేగుచున్నది. మెఱుపు మేఘము తోనే మాయమగుచున్నది. ప్రమదలు పతిమార్గానుగామిను లని విచేతనములకుగూడ తెలియుచున్నది.

వల్లభమైన యీ ప్రియగాత్రభస్మముతోనె మైపూతఁ దీర్చి నవపల్లవ సంస్తరమునందువలె ఈ తనువు విభావసుని యందు సమర్పించెదను. సౌమ్యుఁడా ! నీవు పలుమాఱు మా యిరువురకు పుష్పశయ్యాస్తరణమున సహాయుఁడవైతివి. ప్రణి పాతాంజలిపూర్వకముగ అభ్యర్థించుచున్నాను. నాకు వెంటనే సొదపేర్పుము.

అటుపయి మదర్పితమైన ఆ వహ్నిని దక్షిణానిలవీజన ములచేత ప్రజ్వాలింపఁజేయుము. నీకు తెలియును. నీ ప్రాణ సఖుఁడు నన్నువిడిచి క్షణమైనను నిలువజాలఁడని-

ఇట్లుచేసి మా యిరువురకు ఒకే సలిలాంజలి నిచ్చెదవు గాక - దానిని నీప్రియబంధువు పరలోకమున నాతోసహా విభజింపకయె త్రావును. అంతేకాదు. పరలోకవిధియందు సహకారమంజరులను నివాపమిమ్ము. నీ నెచ్చెలికి చూతప్రసవములన్న ప్రియముకదా !

అని దేహపరిత్యాగమునకు సన్నద్ధయైన రతిని ఆకాశభవమైన సరస్వతి ఇగిరినమడుగున బెగడుపడిన బేడిసను తొలుకరి వానజల్లువలె కనికరించెను.

ఓ కుసుమాయుధపత్ని! నీపతి చిరదుర్లభుడు కాబోడు. ఏ కర్మచేత హరలోచనజ్వాలయందు మిడుత యయ్యెనో వినుము.

మదనునిచేత ఉదీరితేంద్రియుడై ప్రజాపతి స్వసుతయైన సరస్వతియం దభిలాష మొనరించెను. అంతట వికారమును నిగ్రహించికొని యతడు శపింపగా నితడీఫల మనుభవించెను.

ధర్ముడను ప్రజాపతి అభ్యర్థింప బ్రహ్మ- "ఏనాడు తపస్సుచేత తత్పవశీకృతుడై శివుడు పార్వతిని పరిణయమాడునో, ఆనాడు సముపలబ్ధసుఖుడై స్మరుని స్వశరీరసంగతుని జేయగలడు."

అని మన్మథ శాపావధిప్రదయైన సరస్వతి ననుగ్రహించెను. పిడుగునకును, అమృతమునకు ప్రభవస్థానములు ఒకటియే. సంయములు, అంబుధరములు.

ఓ శోభనాకృతీ ! భవితవ్యప్రియసంగమమైన యీ శరీరము పరిరక్షించుకొనుము. రవికిరణములతో శోషించిననది గ్రీష్మావసానమున మఱల ప్రవాహముతో కూడికొనును.

ఈరీతిగ అదృశ్యరూపమైన ఒకానొక భూతము రతి యొక్క మరణవ్యవసాయబుద్ధిని మందీకరించెను. దానియందలి విశ్వాసముచేత కుసుమాయుధబంధువైన వసంతుడు ఆ రతిదేవిని సుచరితార్థములైన వచస్సులతో ఆశ్వాసించెను.

పిమ్మట వ్యసనకృశీభూతయైన మదనవధువు విపత్సమయావసానమును కిరణపరిక్షయ ధూసరయైన దివాతన శశిలేఖ దివసానమునువలె ప్రతీక్షించుచుండెను.

తపఃఫలోదయము

అట్లు కన్నులయెదుటనే వలరాజును దహించిన పినాక ధరునియెడ ఆశతెగి కృశించుచు పార్వతి లోలోన తన యంద మును నిందించికొనెను. ఎంతచూచినను ప్రియుని వలపున కెక్కుటయే రూపమునకు ఫలము.

ప్రణిధానమునూఁది తపములుచేసి తన సౌందర్యమును సఫల మొనరించుకొనుట కామె కృతనిశ్చయ యయ్యెను. మఱి యొక విధమున ఆ తీఱయిన ప్రేమకాని అట్టి పతికాని యెట్లు పడయనగును ?

'గిరిశుని యందె లగ్నమైన మనసుతో తపమునకుఁ దొడుగనున్నది' అనివిని తనయను మేన యెడఁదకు హత్తికొని ఆ బెడిదపు తలంపు మానిపించుచు నిట్లనెను.

'కోరిన వేల్పు లింటలేరా! తల్లీ!' తపమెక్కడ ? నీ వెక్కడ ? సుతిమెత్తని శిరీషకుసుమము తుమ్మెదవ్రాలిన నోర్చి కొనునేమొ కాని పక్షివ్రాలిన తాళలేదు.

ఇట్లనునయించియును స్థిరనిశ్చయయైన బిడ్డపట్టు మేన సడలింపలేకపోయెను. వలచినదిక్కున కగ్గపడియున్న యుల్ల మును పల్లమునకు మొగ్గఁబడియున్న వెల్లువను ఎవరు మళ్ళింప గలరు ?

ఆమనస్విని ఒకనాడు తన మనోరథము నెఱిగియున్న తండ్రిని ఆసన్నసఖీముఖమున ఫలోదయావధియగు తపస్సమాధి

కయి తనకు వనవాసము నభ్యర్థించెను. అంత అనురూపాభినివేశమునకు సంతోషించి పితృపాదు లనుమతింప ఇంకపయి ప్రజలలో 'గౌరీశిఖర'మని తన పేర వెలయనున్న మయూరమయ మగు శిఖరమున కామె యరిగెను.

అచలనిశ్చయయగు ఆ గిరికన్య తూఁగాడు పేటలతో గందపు పేటులను డులుచు ముత్యాలసోఁగు నావలబెట్టి బాలారుణ వర్ణమగు నారచీరను కట్టెను. ఆమెనెమ్మోము భూషితము లైన పెన్నెఱులతో మున్నే రీతిని మధురమైయుండెనో, ఇప్పుడు జడలుగట్టుకొనిపోయినను ఆరీతినే యింపు లొలుకుచుండెను. భ్రమరమాలా నిషేవితమైనపుడే కాదు-కమలము శైవాలము పొదివికొని యున్నపుడును సిరికి నెలవయియుండును. క్షణక్షణము ఒడలు గగురుపొడిపించు మౌంజిని వ్రతార్థ మామె ముప్పేటలుగాఁ జుట్టికొనెను. మున్నెన్నడు తాల్చియెఱుగని ఆ మౌంజవలన ఆమెకాంచీపదము కంది యెఱ్ఱబాఱెను. విస్మృష్ట రాగమయిన పెదవినంటక స్తనాంగరాగ మంటి యెఱ్ఱనైన కందుకము నావలఁద్రోచి కుశాంకురములు చిదిమి నెత్తురొలుకు ఆచేయి జపమాలకు నెచ్చెలి యయ్యెను. మహార్హతల్పమున పొరలునపుడు రాలిన తన వేనలిపూవులే యొత్తికొనెడి ఆ యుత్తమ సౌకుమార్య చేయి తలగడగా నూఁదికొని కటికనేల మీఁదనే యిపుడు విశ్రమించుచున్నది. వ్రతస్థయైన యామె యెలదీవలయందు విలాసమును, లేటికన్నెలయందు బెళుకు జూపును న్యాసముగ సమర్పించినదివలె నుండెను. పాలుమాలక

ఘటస్తన పయస్సులోలికి స్వయముగ బాలపాదపములను పెంచిన ఆ నెనరెట్లు చెప్పనలవియగును ! మలికానుపా యాలు తలల వేల్పయిన తొలికాన్పుపై కూర్మి తొలగింపఁబోదు. దోసిళ్ళతోనిచ్చి తినిపించిన అడవివడ్లకు మాలిమియయి నెచ్చెలుల యెదుట లేళ్ళు తమకన్నులతో మిన్నక ఆమెకన్నులను కొలువనిచ్చెను. స్నానమొనరించి వేలిమితీర్చి అజినము కప్పికొని అధీతినియైన ఆదేవిని దర్శింపగోరి ఋషులు తరలివచ్చిరి. ధర్మవృద్ధులయెడ వయస్సు చూడరు. నైసర్గికమగు పూర్వమత్సరము విడనాడి కలసిమెలసి మసలుచున్న మృగములతో అభీష్టఫలములిచ్చి అతిథుల నర్చించుచున్న ద్రుమములతో, ఉటజమధ్యముల వేల్చినవహ్నులతో, ఆ తపోవనముకూడ పావనమయ్యెను.

అంతమాత్రపు తొలితపముచేత కాంక్షితము లభ్యము కాదని తోచినంతనే తన శరీరమార్దవము నుపేక్షించి ఆమె మహాతపస్సున కుపక్రమించెను.

తొల్లి కందుకక్రీడలకుఁ గూడ వడలిపోయెడి తల్లి మునిజనైకసాధ్యములగు తపములకుఁ దొడఁగెను. ప్రకృతి మృదువయ్యును సారమహితమగు నామె నెమ్మేను నిక్కముగ కాంచన పద్మనిర్మితము.

మండువేసఁగిలో ప్రజ్వలించుచున్న నాలుగు వహ్నుల నడుమ శుచిస్మితయై నిలిచి – నేత్రప్రతిఘాతినియైన ప్రభను గెలిచి – అనన్యదృష్టియై ఆమె సవితను జూచెను. అట్లు రవి

కిరణములచే ఆరఁగ్రాఁగి ఆమె నెమ్మోము విరిదమ్మిసిరికి నెలవయ్యెను. సోగలైన కంటిక్రేవలు మాత్రము కొంచెము నల్లఁబడెను. అయాచితమై యొదవిన కేవలాంబువుతో రసమయుడైన యుడురాజు నంశువులతో ప్రాణధారణ సేయుచు నామె వృక్షవృత్తి నవలంబించెను. అనింధనమైన మింటిమంటకును ఇంధనసంభృతములయిన మంటిమంటలకును క్రాఁగిక్రాఁగి వేసఁగికడపట తొలకరింపులకు తడిసి భూదేవితోసహా ఆదేవి వెచ్చని యావిరు లెగఁజిమ్మెను. తొంగలిఱెప్పల క్షణముసిలిచి పెదవి ప్రిదిలిచి చనుగట్టుంబడి తుత్తుమురులై వళులలో తొట్రిలుచు ఎట్టకేలకు తొలకరిచినుకు లామె నాభిని ప్రవేశించెను. ఎడగాలులైన జల్లులలో ఆరుబయట శిలాతలాసీనయైయున్న ఆదేవిని మహాతపస్సాక్ష్యముననున్న క్షపలు మెఱపుఁగనువిప్పులతో చూచుచుండెను. మంచు ముమ్మరముగ విరఁజిమ్ము గాలులలో తన యెదుటనే కవఁబాసి ఒండొంటికై యడలుచున్న చకవాకమిథునముపయి కనికరమూని ఆమె పుష్యమాసపురేలు గడపెను. నడురేయి పద్మసుగంధియై అల్లల కదలుచున్న అధరదళముతోడి తన నెమ్మొగముతో, హిమహతనళినములైన సలిలములకు ఆమె ఒక నెత్తమ్మిని తోడిగెను. స్వయంవిశీర్ణములయిన తరుపర్ణములె జీవనమగుట తపములకెల్ల పరాకాష్ఠ. ఆమె దానినిగూడ గడచెను. ఇందువలననే పురావిదులు ఆ ప్రియంవదను "అపర్ణ" అనియు నందురు.

ఈ వ్రతములతో అహర్నిశము మృణాళికా సుకుమార మైన తన శరీరమును కృశింపజేయుచు కఠినశరీరోపార్జితమైన మహామునుల తపమునెల్ల ఆమె క్రిందుపఱిచెను.

అంత అజినాషాఢములను ధరించి బ్రహ్మమయమైన తేజస్సుతో ప్రజ్వలించుచు మూర్తికట్టిన మొదటి యాశ్రమ మువలె, ప్రగల్భవచనుడైన ఒకానొక జటిలుడు ఆ తపోవనము ప్రవేశించెను.

అతిథేయియగు పార్వతి ఆ బ్రహ్మచారిని బహుమాన పురస్సరమైన సపర్యతో ప్రత్యుత్థాన మొనరించెను. స్థిరచిత్తులు సములనుసైతము వ్యక్తివిశేషమునుబట్టి అధికముగా మన్నింతురు.

యథావిధిగ నిచ్చిన ఆతిథ్యసత్కారము స్వీకరించి బడలిక తీరుచున్నవానివలె ఒక్కక్షణము గడపి అతడు ఉమవంక సూటిగ చూచుచునే క్రమము దప్పక పలుకదొడఁగెను.

వేలిమికి సమిధలు దర్భలు సమృద్ధిగ దొరకుచున్నవా? జలములు స్నానక్రియాయోగ్యములై యున్నవా? నీ శక్తిని మించి తపస్సున ప్రవర్తించుటలేదుగదా! ధర్మసాధనములలో మొదటిది శరీరమేకదా!

చిర పరిత్యక్తాలక్తక మయ్యును నిసర్గపాటలమైన నీ మోవితో సరితూఁగుచు నీవుపోసిన నీటితో పెరుగుచున్న ఈ వనలతాపల్లవము కొనలుసాగుచున్నదా? బెళుకుచూపులతో నీ చూపులపోలికను అభినయించుచున్నవి వలె చేతిదర్భలను

చనవుకొలఁది లాఁగికొనుచున్న ఈ లేళ్ళపై నీమనస్సు కలఁగుట లేదుగదా. పార్వతీ! సౌమ్యమైన ఆకృతి ధర్మప్రవృత్తి నెన్నఁడును మీఱదనుమాట యథార్థము. కనుకనే ఉదారదర్శన వగు నీశీలము మునిజనములకును ఉపదేశపదము నలంకరించుచున్నది. చెదరిన సప్తర్షిపూజా సితకమలములతో విరుగఁబడి నవ్వుచు మింటినుండిదిగిన గంగాజలములుకూడ అకలుషమైన నీ చరితమువలె ఆయేడీయేడు తరములుగ ఈ గిరిరాజును పావన మొనరించియుండలేదు.

భావినీ! అర్థకామములను విడిచి ఒక్క ధర్మమునే నీవు ప్రతిగ్రహించి సేవించుటనుబట్టిచూడ త్రివర్గమునకెల్ల ధర్మమే సారభూతమని నేటికి నాకు తెలియుచున్నది. నీవింత యాతిథ్యమిచ్చి మన్నించిన నన్ను అన్యునిగా భావింప వనుకొందును. సజ్జనులసంగతి సాప్తపదీన మని మనీషులందురు. తపస్వినీ! ఇందువలన మిక్కిలి యోరిమిగల నిన్ను విప్రస్వాభావికమగు చొరవవలన ఒకటి అడుగవలె ననిపించుచున్నది. రహస్యము కాకున్న చెప్పఁదువుగాని.

పుట్టినది ప్రథమప్రజాపతివంశమున. రూపమా! త్రిలోకసౌందర్యము రాశివోసినట్లు. ఐశ్వర్యసుఖమా! అన్వేషింపఁ బనిలేదు. ప్రాయమా! కడులేఁత. ఇంకను వేఱుగా తపఃఫల మేమైయుండునో చెప్పుము.

దుస్సహమైన విప్రియమువలనఁ గూడ ఒకప్పుడు మనస్వినుల ప్రవృత్తి యీతీఱున నుండును. ఎంతదూర మాలో

చించినను నా మనస్సునకు నీయెడ అట్టిదేదియు కొనవచ్చుట లేదు. శోకము పొదివికొనుటకు వీలులేని యాకృతియిది. పితృ మందిరమున అవమానమున కవకాశమెక్కడ ? పన్నగఫణాగ్ర రత్నశలాకకై యెవ్వడు చేయసాచును ?

మఱి-యీ మెలఁబ్రాయమున నగలు తొలగఁద్రోచి వార్థకానురూపమగు వల్కములను దాల్చిన హేతు వేమయి యుండును ? రజనీముఖమున నెలతో చుక్కలతో దేదీప్యమాన ముగ వెలుగవలసిన యెలరేయి అరుణాక్రమణమున కర్హమగు నేమొ ! నీవే చెప్పుము.

స్వర్గముపయి తలంపో! వృథాశ్రమ. మీతండ్రి హిమగిరి సార్వభౌముని యుపత్యకాధిత్యకలే దేవభూములు. ఇఁక వరుడా? చాలునుతపము. రత్నము వెదకికొనదు. దానిని వెదకికొందురు.

వెచ్చని నిట్టూరుపు తెలియఁజెప్పుచునేయున్నది. నా మనసుమాత్రము సంశయమున నే మునుఁగుచున్నది. నీవు కోరఁ దగినవాడే కానరాడు. కోరిన దుర్లభుడుకూడ నుండునా ?

ఓహో ! యింతకాలముగ కర్ణోత్పల స్నేహశూన్యమై యున్న యీ కపోలపాళిక పయి కలమాగ్రపింగళములయి జీఱా డుచున్న యీ కఱకుజడలను మిన్నక చూచుచుండె ననగా ఆ నీవలచిన తరుణడెవ్వడో స్థాణువైయుండును. ఈ మునివ్రత ములతో నింత కృశించి యెండలకు కమలిన యీభూషాస్థానము లతో పగటినెలవంక వలె నున్న నిన్నుఁ జూచుచున్న యుసు రున్న యెవ్వని మనసైన 'యుస్సురు' మనక యెట్లుండును ?

కుటిలపక్ష్మములయీఱమిలో దాఁగిలిమూఁతలుగ మెఱపు చూపు లోలయించెడి ఈ మదిరాయతనయనములకు ఇంత కాలమై తన మొగమును అగుపఱచని ఆప్రేమాస్పదుడెవ్వడో కాని - చక్కదనపుటెక్కునకుఁ బోయి నిక్కముగ నష్టపడెనని తలంతును.

గౌరి! యింకెంతకాలమని బడలిపోయెదవు? నాయొద్దను పూర్వాశ్రమసంచితమైన తపము కొంతగలదు. అందలి యర్ధభాగమున కాంక్షితసిద్ధి నొందుము. ఆ వరుని మాత్రము విశదముగ తెలియఁగోరుచున్నాను.

ఇట్లు తలఁచి యడుగుచున్న ద్విజునకు తనమనోగతమును ఆమె వెలువరింపఁ జాలకపోయెను. అంత, పార్శ్వపరివర్తినియైన నెచ్చెలివంక కాటుక తీర్పని కన్నుల త్రిప్పిచూచెను.

ఆ నెచ్చెలి బ్రహ్మచారితో నిట్లనెను.

ఓయి విబుధుడా! నీకు కుతూహలముగా నున్నచో వినుము. ఎండకు పద్మమును గొడుగుగాబట్టినట్లు తనశరీరమును ఈమె తపస్సాధనముగాఁ జేసిన విధము వివరింతును.

ఈ మానిని సమగ్రైశ్వర్య విభూషితులైన మహేంద్రప్రభృతి చతుర్దిగీశ్వరులను నిరాదరించి కామవిజేతయైన సౌందర్యహార్యుడు కాకయున్న పినాకపాణిని పతిగాఁబడయఁగోరుచున్నది.

తొల్లి దుస్సహ రుద్రహుంకారమువలన పెడకు తిరిగి పురవైరి యెడకుఁ జేరనియలుగులతో తనువు భస్మమైపోయినను

పుష్పధనువునుండి నిగిడిన బాణముమాత్రము ఈమె హృదయమునందు గాటముగ నాటికొనెను.

నాఁడు మొదలుగ ఆవిష్టమదనయై యీ బాలపుట్టినింటిలో లలాటచందనమంటి ధూసరితములై చెదరిన ముంగురులతో కరడుగట్టిన మంచుటాలమీఁదఁగూడ చల్లదనము ననుభవింప లేదు. వనాంతముల పినాకధరుని చరితమున పల్లవి నందుకొనినంతనే డగ్గుత్తికతో తొట్రిలిపడుచున్న మాటలతో నీమె సంగీతసఖులైన కిన్నర రాజకన్యకలచేత ఎన్నోమారులు కంట నీరు పెట్టించెను.

నిశా చరమయామములలో ఒక్కక్షణము కన్నుమూసి "ఓ నీలకంఠ ! ఎచ్చటికి పోవుచున్నావో !" అని కలవరించుచు శూన్యాకాశమున కీలించిన కౌఁగిలితో ఉలికిపడి మేలుకొనుచుండెను.

బుధులు నిన్ను సర్వగతుడవని పలుకుమాట నిజమేయైనచో నా మనోగతము నీకెట్లు తెలియకున్నది? అని యేకాంతమున స్వహస్త లిఖితుడైన శశిశేఖరుని ఆ ముద్దరాలు తెగ నాడుచుండెను.

ఆ జగత్పతినిఁ బడయుటకు ఇంకొక యుపాయ మరసి కానలేనిదియై యీమె తండ్రి యనుజ్ఞవడసి మాతో కలసి తపమునకై యీ తపోవనము చేరినది.

తాను నాటిన తపస్సాక్షి భూతములైన ఆనాటి యీ తరువులుసైతము ఫలముగాంచినవి. ఆ శశిమౌళి నంటియున్న

979

యీామె మనోరథముమాత్రము మొలకెత్తఁబోవున ట్లయినను గానవచ్చుట లేదు.

ప్రార్థిత దుర్లభుఁడయిన ఆ స్వామి యిట్లు తపఃకృశమై మాచేత కంట నీరుపెట్టించుచున్న యీామానెచ్చెలిని అనావృష్టి క్షతమైన నాగటిచాలును పర్జన్యునివలె ఎన్నటికి కరుణింప గలఁడో యెఱుగను.

ఇట్లు ఆమెభావము చాటుసేయనిరీతిని ఇంగితజ్ఞురాలయిన నెచ్చెలి తేఁటపరుపగా హర్షలక్షణములను వెలువడ నీయక ఆ నైష్ఠికసుందరుఁడు ఇదియంతయు నిజమేనా? లేక పరిహాసమా ? అని యుమను సూటిగా నడిగెను.

అంతట ముకుళీకృతాంగుళులతో ముంగేల స్ఫటికాక్షమాల పూని అద్రితనయ ఎట్టకేలకు మితాక్షరమగు పలుకు వెలువరించెను.

ఓ వేదవిద్వరుడ ! నీవు విన్నదంతయు నిజమే. ఈప్రాణి, ఉన్నత పదాక్రమణోత్సుకమై యున్నది. ఈ తపమట - తద వాప్తికి సాధనమట - కోరికలు చేరనితావు లేదుకదా !

అంతట ఆవర్ణి యిట్లనెను.

ఏమీా ! మహేశ్వరుడా ! తెలియని దెవ్వరికి ? ఇంకను నీ వతనినే కోరికొనుచుంటివన్నమాట. ఆ యమంగళాభ్యాసములు తలంపునకురాగా నిన్ననుసరించుటకు నాకు మనసు రాకున్నది.

నీ యభినివేశము అస్థానపతితమైనందులకే విచారము. అయ్యో! పెండ్లితోరముతోడి యీ నీచేయి సర్పభూషణమైన శంభునిచేతితో ఆ ప్రథమావలంబనము నెట్లు లోర్వఁగలదో గదా! నీయంతట నీవే ఒక్కసారి విచారించి చూడుము. ఎన్నఁడైనయీ రెండునుముడిపడదగినవేమొ! కలహంసలాంఛితమైన వధూదుకూలము శోణితబిందువులు చిందు గజాజినమును. చతుష్కభవనములలో పుష్పరాసులపయి నడయాడెడి నీ చరణముల లాక్షాంకములు కేశపరీతములైన స్మశానభూములలో ముద్రితము లగుటకు పగవాఁడయినను అనుమతించునా?

ఇంతకన్న అయుక్త మేమియుండునో చెప్పుము. ఆ త్రినేత్రుని పరిష్వంగము నీకు సులభమే యగుగాక. హరిచందనాంకితమైన యీవక్షస్థ్సలముపై చితాభస్మరేణువుచేరఁగలదు. ప్రప్రథముననే నీ వెదుర్కొనవలసియున్న పరిహాస మింకొకటి యున్నది. పెండిలియై పట్టపుటేనుగుమీద నూరేగవలసిన నీవు ఆ ముసలియెద్దుపై కనఁబడినంతనే మహాజనము స్మేరముఖము కాఁగలదు. కపాలిని వలచియుండుటచేత ఇప్పుడు రెండు శోచనీయదశకు వచ్చియున్నవి. కాంతిమతియైన ఆ చంద్రకళయొకటి; ఈ లోకమునకు కన్నులవెన్నెలవైన నీవొకదానవు.

సౌందర్యమా? విరూపాక్షము. పుట్టువా? తెలియదు. దిగంబరత్వమే సంపదను తెలుపుచున్నది. ఓ ముగ్ధమృగాక్షి! సాధారణముగ వరులలో అరయదగినవానిలో నేయొకటియైనను ఆకృతివాసునియందు కలదో!

ఈ చెడుకోరికనుండి మనస్సు మరలించికొనుము. అట్టి లక్షణములుగల అతఁడెక్కడ! పుణ్యలక్షణమైన నీవెక్కడ! స్మశానశూలమునకు వేదవిహితమైన యూపసత్క్రియ నొనరించుటకు సాధుజనులు సమ్మతింపరు.

ఇట్లు బ్రాహ్మణుడు ప్రతికూలములు పలుకుచుండగా ప్రవేపమానాధర లక్ష్యకోపయై ఆదేవి ప్రాంతలోహితములైన కన్నులను సభ్రూభంగముగ ప్రక్కకుఁ ద్రిప్పికొనెను.

మఱియును ఆ బ్రహ్మచారి నిట్లు లుత్తరించెను.

పరమార్థముగ హరుని నీ వెఱుగవు. కనుకనే నాతో నిట్లు పలుకుట.

లోకసాధారణము కానందున హేతువు నూహింపరానందున మహాత్ముల చరితమును తెలియనివారిట్లే నిందింతురు.

మంగళ మెవ్వనికి ? ఎవనికి విపద్భీతియుండునో, ఎవ్వనికి ఐశ్వర్యకాంక్ష యుండునో, వానికి. సర్వలోకశరణ్యుడై నిరభిలాషుండై యున్న కేవల సన్మూర్తికి ఇట్టి ఆశోపహతచిత్తవృత్తులతోఁ బనియేమి ?

స్వామి అకించనుడయ్యును, సంపదలకెల్ల ప్రభవభూమి. స్మశానసంచారి యయ్యును త్రిలోకనాథుడు. భీమరూపుడయ్యును శివుడని కీర్తింపఁబడుచున్నాడు. ఆ పినాకధరుని నిజతత్త్వ మెఱిగినవారు లేరు.

విశ్వమూర్తి శరీరము విభూషణములతో ఉద్భాసింపను వచ్చును. ధృతసర్పమైనను కావచ్చును. గజాజినము చుట్టికొనన నైనవచ్చును. దుకూలమైనఁ దాల్పవచ్చును. కపాలమునైన ధరింపవచ్చును. కాక – శశాంక శేఖరమైనను కావచ్చును. ఇది యిట్లుండునని నిర్ధారణ లేదు. ఆయన అంగసంసర్గమునంది చితా భస్మరేణువైనను పావనమగుట ధ్రువము. నృత్యాభినయ వేళా విగళితమైన యీ రేణువును దివౌకసులు అహమహమికతో శౌదలలపయి వహించుచున్నారు. దరిద్రుఁడగు నతడు వృషారూ ఢుఁడై యేగుచుండగా ప్రభిన్నమదగండమైన యైరావతముపై నారోహించి వచ్చుచున్న వృష, ఆస్వామి పాదములను ప్రణామ విగళిత వికసిత మౌళి మందారమంజరీ పరాగ పరిరంజితాంగుళు లుగఁ జేయుచున్నాడు. దోషమునే చెప్పదలచియును నష్టాత్ముఁ డవయిన నీవుకూడ శివునిగూర్చి యొక్క లెస్సమాట యంటివి. ఆత్మభువునకు గూడ కారణమని కీర్తింపఁబడుచున్నవాని జన మును ఎట్లు లక్షింపవచ్చును ?

వివాదమేల ? నీవెట్లు వింటివో అట్టివాడే యగునుగాక. ఆతనియందే నా మనస్సు లగ్నమైయున్నది. స్వేచ్ఛావృత్తులకు నిందతో నేమిపని ?

ఓసి నెచ్చెలీ ! ఈ వటువు మఱల నేదో మాటాడుటకు అధరస్పందము చేయుచున్నాడు. వారింపుము. మహాత్ములను నిందించినవారే కాదు. విన్నవారును వారికంటె పాపభాక్కులు.

లేక - నేనే యిచటినుండి పోయెదను. అని అలుకమెయి జాఱిన స్తనవల్కలముతో బాల యచటినుండి కదలెను. స్వరూప స్థితుడై వృషరాజకేతనుడు నవ్వుచు నామెను సమాలంబన మొనర్చెను.

ఆతనినిఁ జూచి వేపథుమతియై చెమర్చిన నెమ్మేనుతో భూనిక్షేపార్థమై యెత్తినచరణ మెత్తినట్లే నిలిచి- మార్గాచల వ్యతికరమువలన పర్యాకులితమైన నదివోలె శైలాధిరాజ తనయ పోవనులేదు - నిలువనులేదు.

అవనతాంగి! నేటిమొదలు నీకు తపఃక్రీతుఁడైన దాసు డను అని శశిమౌళి యనుచుండగనే ఆదేవి తపము బడలికల నెల్ల వీడుకొలిపెను. క్లేశము ఫలసిద్ధినంది పునర్నవీభావము కల్పించును.

అంతట గౌరి యేకాంతమున విశ్వాత్మునితో 'భూధర రాజును తనకు దాతగా మన్నింపఁదగునని' నెచ్చెలిచే పలుకఁ బంచెను.

సఖి సందేశమును పలుకుచుండగా ప్రియునియెదుట గౌరి మధుమాసమున కోకిల కూయుచుండగా నిశ్చలమై చేరువనే యున్న చూతశాఖవలె పొలిచెను.

ఆ స్మరశాసను డట్లేయని ప్రతిశ్రుత మొనరించి - వీడ లేక వీడలేక ఉమను వీడి జ్యోతిర్మయులైన ఋషుల నేడ్వురను సంస్మరించెను. వెంటనే వెలుఁగుపిండులతో మింటికడలెల్ల వెలి గించుచు అరుంధతీసహితులు ఆ తపోధనులు ప్రభువు నెదుట ప్రత్యక్షమయిరి.

ఆ ఋషులు-తీరమందార విగళితములైన విరులెగఁజిమ్ము నలలతో దిఙ్నాగ మదగంధిలములైన మిన్నేటిజాలులలోఁ దోఁగి వచ్చినవారు. ముత్తియపు జన్నిదములు దాల్చినవారు. పసిడి వల్కలములవారు. రత్నాక్ష సూత్రములవారు. ప్రవ్రజన దీక్షలోనున్న వేల్పుచెట్లులను బోలియున్నవారు. తేజులను క్రిందుగాదోలి - టెక్కెమును వ్రాలిచి - క్షైజతమోడ్చి - వార్చిన వేవెలుగు, చూడ్కి తమపై నెక్కొలిపి యున్నవారు. ప్రళయాపదయందు బాహులతలు సాచి పెనవైచికొనియున్న భూదేవితోసహా సముద్ధరింపఁబడి మహావరాహదంష్ట్రయందు విశ్రాంతి ననుభవించినవారు.

నలువకు పిమ్మట తరువాయి సృష్టి నిరవాక మొనరించి యున్నందున - తొల్లింటి పెద్దలు "పురాతన విధాత" లని యగ్గింప నెగడినవారు. పండఁబాఱిన మునుపటి తపము పంట లను తనివార భుజియించుచు మఱల దపములు దొడిగినవారు.

వారి నడుమ పతి యడుగులపై చూడ్కి నిలిపి నిలిచి యున్న అరుంధతీదేవి సాక్షాత్కరించిన తపస్సిద్ధివలె భూయిష్ఠ ముగ భాసించెను.

పరమేశ్వరు డామెను ఋషులతో సమానగౌరవముగ జూచెను. స్త్రీయని - పురుషుడని లేదు. మహాత్ములకు చరితమే మహితము. ఆ యరుంధతీ దర్శనమున శంభునకుఁ దారార్థమై యాదరము బహుతరముగ పెరిగెను. ధర్మ్యములగు నెల్లసత్క్రియలకు సత్పత్ని లేకదా మూలకారణము! పార్వతీ విషయమై పరమేశ్వరునియెడ ధర్మమిట్లు లడుగుమోపినంతనే పూర్వాప రాధభీతుఁడగు కాముని మనము తెప్పరిల్లెను.

అంతట అనూచానులైన ఆ ఋషు లందఱు జగద్గురుని పూజించి హర్ష పులకితశరీరులై యిట్లు పలికిరి.

ఏ వేదమును గ్రోల్చితిమో, ఏ వేలిమి తీర్చితిమో, ఏ తపము నడపితిమో మాకు దానిఫల మిప్పుడు ప డినది. సర్వ జగత్పతివైన నీవు మనోరథములకు అప్రాప్యమైన నీ మనో భూమియందు మమ్ము నిలిపితివికదా. ఎవని మనసులో నీవు నిలుతువో వాఁడొక్కఁడే కృతార్థతముడు. ఇక బ్రహ్మకారణుడ వైన నీమనసులో నిలిచియున్నవాని నేమనవలయును! సూర్యుని

కంటె, సోమునికంటె ఉన్నతమైన పద మధిష్ఠించితిమి. ఓ విరూపాక్ష! నీవు తలంచినందున మాకు గలుగుచున్న యానందము నెట్లు నివేదింపగలము? దేహధారుల కంతరాత్మవుకదా! నేడు ప్రత్యక్షముగ నిన్నుఁ జూడగంటిమి. నీ నిక్కమెఱుఁగము. ప్రసన్నుడవై నిజస్వరూపమును మాకు చెప్పుము. ఈ మూర్తి ఏమూర్తి? దేనితో నిదియంతయు సృష్టింతువో అదియా? లేక-దేనితో భరింతువో అదియా? మఱి దేనితో లయింతువో అదియా?

అయిన నిప్పటి కీప్రార్థన నిట్లుండనిమ్ము. నీ తలఁపునబడి వచ్చిన మమ్ము పనిగొనుము స్వామీ! ఏమి సెలవు?

అంతట పరమేశ్వరుడు తలపై ఎలవెల సన్నని వెన్నెలను తన పలువరుస తెలివెలుగులతో - ప్రోఁదిసేయుచు నిట్లు పలికెను.

నా పనులేవియును నాకై కాదని మీకు తెలిసియే యున్నది. మూర్తులెనిమిదియును ఈ నాప్రవృత్తినే సూచించుచున్నవిగదా.

ఆ నన్ను - తృష్ణార్తితములైన చాతకములు వానకై మేఘమును యాచించునట్లు శత్రుపీడితులై దేవతలు సంతతికై యాచించిరి. ఇందువలన అగ్నినిష్పాదనమునకు యజమానుఁడరణి నపేక్షించినట్లు ఆత్మజునికై పార్వతిని పరిగ్రహింపఁ గోరుచున్నాను. ఆమెను అస్మదర్థమై మీరు హిమవంతు నడుగవలసియున్నది. సదనుష్ఠితములైన సంబంధములు బెడిసిపోజాలవు.

ఉన్నతుడు, స్థితిమంతుడు, పృథివీధురంధరుడునైన ఆ హిమవంతునితోఁ జుట్టరికమైనచో నేనును నష్టపోవునది లేదని విచారింపుడు. కన్యార్థమై ఆయన కిట్లు చెప్పవలయునని మీకు నే నుపదేశింపవలసిన పనిలేదు. మీరు నడచినదే యాచారమని పెద్దలమతము. ఈ యరుంధతీదేవియె యచ్చటిపని తీర్పఁదగియున్నది. ప్రాయికముగ ఈవిధమయిన కార్యములందు పురంధ్రులకే నేర్పుగలిగియుండును.

అందువలన సిద్ధికై, హిమవత్పురమగు ఓషధిప్రస్థమునకు పయనము దీర్పుఁడు. ఈ మహాకోశీప్రపాత ప్రదేశమునందే మఱల మనము కలియుదుము.

ఇట్లు యోగీశ్వరులకెల్ల నాద్యుడయిన ఆ పరమేశ్వరుడు పెండ్లికి సిద్ధపడినంతనే ప్రాజాపత్యులైన పరమర్షులు మనసులలో తాము పెండ్లియాడితిమన్న సంకోచమును విడనాడిరి.

పిమ్మట, ఓంకారపురస్సరముగ మునిమండలము కదలెను. పరమేశ్వరుడును ప్రథమోద్దిష్టస్థానము చేరెను.

మన స్సమవేగులైన ఆ పరమర్షులు అసిశ్యామమైన వ్యోమమున కెగిరి ఓషధిప్రస్థమును చేరిరి.

వసు సంపదలకు వసతియైన అలకను చిదిమిపెట్టినట్లు - స్వర్గపు మిగులెల్ల ఓడ్చి నెలకొల్పినట్లు-గంగాప్రవాహ పరివేష్టితమై, వప్రాంతర్జ్వలిత మహౌషధియై విపుల మణిశిలాప్రాకారమై గవిసెనలో నుండియును - ఆ యోషధిప్రస్థ మత్యంత మనోహరముగ నుండెను.

అచటి యేనుఁగులు సింహభీతి నెఱుఁగవు. గుజ్జులు గుహోపరిభవములు. యక్షకింపురుషులు పౌరులు. స్త్రీలెల్ల వన దేవతలు. అచట ప్రాసాదశిఖరములను కరిమ్ముకొనియున్న మేఘముల యనుగర్జితములలో బెరసిపోయిన మురజధ్వనులు సంస్థాన తాడన రోధము లనెడు కరణభేదములచే మాత్రమే తేటపడుచుండును. కొమ్మలలో రెపరెపలాడుచున్న వలిపము లతో కల్పవృక్షములు ఏ పౌరప్రయత్నము లేక — అచట గృహయంత్ర పతాకాశోభలను దీర్చుచుండును. నిశీథమున స్ఫటికహర్మ్యములపై పానగోష్ఠీ ప్రదేశముల యందు నక్షత్ర ప్రతిబింబములు పుష్పోపహారముల పోలుపు దాల్చుచుండును. ముసురుపట్టిన రేల ఓషధీప్రకాశములు త్రోవలు చూపుచుండ అభిసారిక లచ్చట చీఁకటిమొగమే యెఱుఁగరు. అచ్చట యౌవ నమునకు మించిన వయస్సు లేదు. కుసుమాయుధునకన్న అంత కుడు లేడు. రతిశ్రమ జనితనిద్ర కన్న సంజ్ఞావిపర్యయము లేదు. విఱిచిన కనుబొమలు, అదరిన మోవులు, సాగసు వ్రేలి బెదరిం పులునైన చెలువల యలుకలతో ప్రియులు ప్రసాదపర్యంతము అర్థులై పడియుందురు. సంతానక తరుచ్ఛాయలలోఁ ఆదమఱచి నిద్రించుచున్న విద్యాధరాధ్వగులతో గంధమాదన మను పేరి సురభిళోపవనము — ఆ పురము వెలుపల నెలకొనియుండును.

దివ్యమునులు ఆ హిమవత్పురమును జూచి స్వర్గలాభము నకై శ్రుతి నిర్దేశించిన పుణ్యము వట్టి వంచనయని తలంచిరి.

ఉన్ముఖమై ప్రతీహారజనము చూచుచుండగ హిమవద్భ వనమునందు లిఖితానల నిశ్చలములయిన జటాభారములతో వేగముగ ఆ మునులు అవతరించిరి.

వృద్ధానుపూర్వముగ గగనావతీర్ణమైన ఆ మునిపరంపర తోయాంతరాళమునందలి భాస్కర ప్రతిబింబాళివలె విరాజిల్లెను.

గిరి - అర్ఘ్యజలము లెత్తికొని అంతస్సార దుర్భరములైన పాదన్యాసములతో వసుంధర నణంచుచు, అర్ఘార్హులయిన ఆ మహర్షులను దూరమునుండియే ప్రత్యుత్థాన మొనరించెను.

ధాతు పాటలాధరములతో ప్రాంశువై దేవదారు మహాభుజములతో, నిసర్గ శిలోరస్కమైన ఆమూర్తి హిమవంతుడని చెప్పకయే తెలియుచుండెను.

విధివిహిత సత్కారులైన ఆ విశుద్ధచరిత్రులను స్వాయముగ మార్గదర్శకుడై అతడు శుద్ధాంతమును ప్రవేశింపజేసెను.

అచట వేత్రాసనాసీనులైన మునీశ్వరులకు ప్రాంజలియై ఆసన పరిగ్రహ మొనరించి - భూధరేశ్వరు డిట్లు పలికెను.

అతర్కితోపనతమైన నేటి మీ దర్శనము మబ్బులేని వానగా - కుసుమదర్శనము లేని ఫలముగా-నాకు ప్రతిభాసించుచున్నది. మీ యనుగ్రహమువలన మూఢుడను జ్ఞానినైనట్లు- అయోమయుడను హైమీభూతుడనైనట్లు - భూమిస్థితుడను దివమారోహించినట్లుగా-అనిపించుచున్నది. నేడు మొదలుగ

ప్రాణులకు సేవనీయుఁడనైతిని. పూజ్యు లధిష్ఠించినదియె తీర్థమందురు.

ఓ ద్విజోత్తములార! మొదల ఆ గంగాప్రపాత మొకటి మీ ధౌతపాదాంభస్సు లివియొకటి - ఈ రెండింటిచేతనే నన్ను పవిత్రీకృతునిగ దలంతును. జంగమము మీసేవ యొనరించి - స్థావరము మీచరణాంకితమై, నా యిరుమేను మీ యనుగ్రహము పంచికొనియున్నట్లు తలంతును. మీ యనుగ్రహజనితమై ప్రసరించుచున్న యీ మహానందమును కబళితదిశాంతము లయ్యును నా యంగములు పట్టఁజాలకున్నవి. జ్యోతిర్మయులైన మీ దర్శనముచేత గుహాలలోని చీఁకటి ఒక్కటియే కాదు-రజసః పరమైన నా అంతర్గతమైన తమస్సుకూడ తొలగింపఁబడినది. మీకు కర్తవ్యమును గానను. కలుగునేని-కానిదేమి? కేవలము నా పావనముననే యిటకు మీరాక యనిపించుచున్నది. అయినను - నన్నేమైన పనిగొనఁ బ్రార్థింతును. ప్రభువులయెడ కింకరులకు ఆనతి గైకొనుటయె మన్నన. ఇదియె మేను. ఇదే కళత్రము. కులజీవితమైన కన్యయు నిదియె. ఇందు మీకెవరితో నేమి కావలయునో ఆనతియిండు. బాహ్యవస్తువులయెడ మీకాస్థ యుండదుగదా!

ఇట్లు పలికియున్న హిమాలయుడు గుహాముఖ ప్రసృతమైన ప్రతిధ్వనిచేత - ఆ యర్థమునే రెండుమారులు పలికినట్లు తోచెను.

పిమ్మట; ఋషులు కథాప్రసంగదక్షుడైన యంగిరసుని ప్రోత్సహించిరి. ఆయన హిమవంతునితో నిట్లు పలికెను.

నీయెడ - ఇదియంతయును మఱి యింతయును పొసగును. నీ మనసును నీశిఖరములును సమానోన్నతములు. నిన్ను స్థావరస్వరూపుడయిన విష్ణువని యన్నమాట సముచితము. చరాచరభూతములకు నీకుక్షి యాశ్రయమై యున్నది. ఆ రసాతల మూలము నుండి నీవే ఆదికొని యుండనినాడు - మృణాళ సుకుమారములైన ఆ పడగలతో శేషుడు భూమి నెట్లు ధరింప గలిగి యుండును? అవిచ్ఛిన్న విమలపారంపర్యములై సముద్రతరంగాభివాహితములై నీకీర్తులు - సరిత్తులును పావనములై లోకములను పవిత్రీకరించుచున్నవి. విష్ణుచరణముచే గంగ యెట్టి శ్లాఘకు పాత్రమైయుండెనో - ద్వితీయ ప్రభవస్థానమవై ఉన్నత శిరస్కుడవగు నీచేతగూడ నట్టి శ్లాఘకే పాత్రమగుచున్నది. విష్ణుని మహిమ త్రివిక్రమోద్యతుడైన వేళనే తిర్యగూర్ధ్వ అధోవిగాహి యయ్యెను.

అట్టి మహిమ నీకు స్వభావసిద్ధము. యజ్ఞాంశభోక్తల మధ్య నీవు పద మూడినంతనే - ఉన్నతమై హిరణ్మయమైన ఆ సుమేరువుయొక్క శృంగభరము వితథీకరింపబడినది. నీ కాఠిన్యమంతయు స్థావర శరీరమునందే. సజ్జనారాధనమైన యీ నీ జంగమశరీరము మాత్రము భక్తి వినమ్రము.

కావున మేమువచ్చిన పని వినుము. అది నీపనియె. శుభముల నుపదేశించినందున - ఇందు మాకును పాలుగలదు.

అణిమాది గుణోపేతమై - పురుషాంతరస్పర్శ నెఱిఁగి యుండని ఈశ్వరశబ్దము నున్నతముగ చంద్రకళతోఁ బాటుగ నెవ్వఁడు ధరించుచుండెనో, ఒకదాని నొకటి యాదికొనినట్లున్న పృథివ్యాదులగు మూర్తు లెనిమిదింటితో గుఱ్ఱములు రథమును వోలె ఈ విశ్వము నెవడు ధరించియుండెనో; క్షేత్రాభ్యంతర వర్తియైన యెవ్వనిని యోగీశ్వరు లన్వేషించుచుందురో, ఎవ్వని పదమును ఆ వృత్తిభయ విరహితమని మనీషులు వచించుచుందురో ఆ జగత్కర్మసాక్షి, వరదుఁడు నగు శంభుఁడు మాయందు నిలిపిన మాటలతో నీ యాత్మజను వరించుచు మున్నాఁడు. వాక్కుతో అర్థమునువలె ఆత్మజతో నతనిని గూర్పదగియుందువు. సద్భర్తృ ప్రతిపాదితమైన కన్యావిషయమున తండ్రికి చింత యుండదుగదా!

స్థావర జంగమ ప్రాణులన్నిటికి నీబిడ్డ తల్లి యగునుగాక. ఈశ్వరుడు జగత్పితకదా! ముప్పదిమూడు కోట్లు విబుధులు శితికంఠునకు ప్రణమిల్లి - అనంతరమె చూడామణి మరీచులతో నీ దుహితృచరణములను రంజిత మొనర్తురు!

వధువా! ఉమాదేవి. నీవా! దాతవు. అర్థులమా! మేము. వరుడా శంభుఁడు. నీ కులోన్నతికే యిదియంతయు నిట్లు సమకూడినది.

ఒకని స్తోత్రముసేయక, స్తూయమానుఁడై, ఒకనికి నమస్కరింపక సర్వవంద్యుఁడై యున్న విశ్వగురునకు సుతాసంబంధ కారణమున గురుత్వపదవి నలంకరింపుము.

దేవర్షి యిట్లు పలుకుచుండగా పార్వతి తండ్రి పార్శ్వమున తలవంచికొని లీలా కమలపత్రముల లెక్కించుచుండెను.

శైలరాజు సంపూర్ణ మనోరథుడై నను తలయెత్తి మేనా ముఖమును చూచెను. ప్రాయికముగ గృహస్థులకు కన్యావిషయమున గృహిణులే నేత్రము.

మేనయును అదియెల్ల పతి కభీప్సితమని తలంచెను. పతివ్రతలు పతి యిష్టమునకుఁ దప్పి చరింపరు.

ఇచ్చట ఇది న్యాయ్యమైన సమాధాన మగునని బుద్ధిచే విమర్శించి-ఆ హిమవంతుడు ముని వాక్యావసానమున మంగళాలంకృతయైన సుతను దగ్గఱకుఁ దీసికొనెను.

'రా తల్లీ ! విశ్వాత్మునకు భిక్షవై సమకూర్పఁబడితివి. అర్థింపవచ్చిన వారు మునులు. గృహమేధిఫలము నాకు దక్కినది.'

అని పలుకుచు హిమవంతుడు ఋషులతో నిట్లనెను. "ఇదియె! త్రిలోచనవధువు. మీ కెల్లరకును బ్రణమిల్లుచున్నది."

ఆ మునులు - అభీప్సిత క్రియోదారమైన - ఆ గిరి వచనమును అభినందించి పురఃఫలములైన ఆశీర్వాదములచే అంబికను వర్ధిలఁజేసిరి.

హ్రీణామాదర స్రస్తజాంబూనదావతంసకయై - సిగ్గుల బరణి యగుచున్న ఆ యుమను అరుంధతీదేవి తన యొడిలో కూర్చుండఁబెట్టుకొనెను.

దుహితృస్నేహ విక్లబయై, అశ్రుముఖి యగుచున్న ఆ పెండ్లికూఁతురు తల్లిని అనన్యపూర్వుఁడగు వరుని గుణములు చెప్పి ఆమె శోక ముడిగించెను.

ఆ క్షణముననే హరబంధువు వైవాహికతిథి నడుగగా వారు మూన్నాళ్ళకుపైనని చెప్పి, వల్కలములు పరిగ్రహించి కదలిపోయిరి.

ఆ ఋషులు హిమవంతుని వీడ్కొని మఱల పరమేశ్వరుఁజేరి సిద్ధార్థమును నివేదించి ఆయన యనుమతితో మింటికెగసిరి.

అద్రిసుతా సమాగమోత్కంఠితుఁడై పరమేశ్వరుఁడా మూఁడుదినములు నతికష్టముగ వెళ్లించెను. విభుఁడైన ఆయనను కూడ నీ భావములు తాఁకుచున్నవనగా-అవశుఁడైన యేయితరుని గలవరపెట్టక యుండును!

అంత శుక్లపక్షమున జామిత్రశుద్ధిగల శుభతిథియందు హిమవంతుడు బంధుసమేతుఁడై పుత్త్రీ వివాహదీక్షావిధిని స్వీకరించెను.

అనురాగాతిశయముచేత ఇంటింట పెండ్లిపనులతో సందడిపడుచున్న పురంధ్రీజనములతో-పురము అంతఃపురము ఒకయిల్లుగా కలసిపోయెను.

మందారకుసుమములు పఱచిన మహాపథములతో, చీనాంశుకములు తీర్చిన కేతుమాలలతో, ఉజ్జ్వలములై వెలుగు కాంచనతోరణ ప్రభలతో, ఓషధిప్రస్థము స్థానాంతరగతమైన స్వర్గమువలె భాసించెను.

ముహూర్తము చేరువయైనకొలఁది-పుత్త్రిలెందరున్నను, చిరకాలమునకు చూచినట్లు - బ్రతికి మఱలవచ్చినట్లు - ఆ యుమ యొక్కతెయే మేనాహిమవంతులకు ప్రాణసర్వస్వమయ్యెను. ఆశీఃపరంపరా పరివర్ధమానయై యామె - ఒడినుండి యొడి కేగెను. నగపై నగ దొడిగెను. బంధువులెల్లర ప్రేమకును ఆమెయే నెలవయ్యెను.

మిత్రాధిదైవతమగు ముహూర్తమున - ఉత్తరఫల్గుని శశలాంఛనునితో నత్తమిల్లినవేళ-సంతాన సౌభాగ్య సంపన్నలగు పేరఁటాండ్రామెను పెండ్లికూఁతును జేసిరి. పాపటలో నిడిన తెల్లని యావగింజల నడుమ - పచ్చని దుర్వాకిసలయము

లందగించుచుండ- ఉమ వెలిపట్టుచీర దాలిచి కయిపట్టిన శర ముతో అభ్యంగ నైపథ్యమునకే యలంకార మయ్యెను.

ఆ దీక్షానాయకమును ధరించిన గౌరి - బహుళావసాన మున భానుకిరణ సంసర్గముతో ఉపచీయమాన యగుచున్న శశిలేఖవలె వెలుగొందెను. లోధ్రపరాగముతో నలుగిడి ఈషదార్ద్ర గంధద్రవ్యముతో మైపూతదీర్చి, స్నానయోగ్య వసనము దాల్పఁజేసి - ముత్తైదువ లామెను స్నానగృహాభిముఖ ముగాఁ గొనిపోయిరి. అచట ముత్యాలముగ్గు దీర్చిన వైడూర్య శిలాఫలకముపై కూర్చుండబెట్టి - మంగళతూర్యముల నడుమ ఆవర్జిత కనకకలశ సలిలములతో నామెకు జలకము లార్చిరి.

మంగళస్నాన వినిర్మల శరీరయై వరధౌత వసనమును ధాల్చిన ఆదేవి పర్జన్య జలాభిషేకానంతరము విరిసిన తెల్లు పూలతో నాచ్ఛాదితయైన వసుధవోలె తేజరిల్లెను.

ఆ స్నానగృహమునుండి వితానమమరించి మణిస్తంభ చతుష్టయ సనాథమై విరచితాసనమైన కౌతుకవేదికడకు పతి వ్రత లామెను పొదివికొనిపోయిరి.

అచట ప్రాఙ్ముఖముగ నామెను గూర్చుండబెట్టి - ఎదు రుగఁ గూర్చుండి-ఆ నిసర్గశోభకు పరవశలై ప్రసాధనము చేరు వనె యున్నను - ఒక్కక్షణము వారు నిశ్చలలైరి.

ధూపము లార్చి, కుసుమములు తురిమి, ఆమె కేశపాశ మును దూర్వాకిసలయాంచితమైన సితమధూక దామమున ఒక సైరంధ్రి హారమనోబంధముగ ముడిచెను. ధవళాగురు సార

మున మైపూత దీర్చి నెమ్మేన సైరంధ్రులు గోరోచనాపత్రి శిల్పములఁ దీర్చుచుండగా నామె చక్రివాంకిత సైకతమైన మందాకినీ కాంతి నతిశయించి వెలిగెను. భ్రమరమాలా నిషేవితమైన పద్మమును, మేఘరేఖాంకితమైన శశిబింబమును. చిన్నబుచ్చి' భూషితాలకలతో ఆమె ఆననలక్ష్మి సాదృశ్య కథా ప్రసంగమునే త్రుంచివైచెను.

లోధ్ర రజోఽనులేపనమున తెలుపారి గోరోచనా విన్యాసముతో పసపునిగ్గులు దేరిన ఆమె కపోలపాళికయందు కర్ణావతంసితమైన యవప్రరోహము వర్ణ సౌభాగ్యముచే చూపఱ నాకట్టుకొనుచుండెను. అలఁతి మైనపుపూఁతతో మెఱుఁగులు దేఱి విభక్త రేఖమై సమాసన్నలావణ్యాఫలమై, పరిస్పందించు ఆమె యధరోష్ఠ మొక యనిర్వచనీయ శోభాసీమ యయ్యెను.

చరణములను లాక్షారంజిత మొనర్చుచు నెచ్చెలి "దీనితో పతి శిరశ్చంద్రకళను తాఁకవలెనుసుమా!" అని మేల మాడుచు దీవనయిడ గౌరి మాఱుపలుకక మాల్యముతో ప్రహరించెను. చక్కని నల్లకలువ రేకులవలె కాంతులుచిమ్ము నామె కన్నులనుజూచి శోభాతిశయమునకు కాదుగాని-కల్యాణ చిహ్నమనిమాత్రమే కాటుక రేకలఁ దీర్చిరి. విడులుచున్న పూవులతో తీగవలె, నిగుడుచున్న చుక్కలతో రేయివలె, మొగుడుచున్న పులుగులతో నదివలె, తొడుగుచున్న నగలతో నామె ప్రకాశించెను.

నిలువుటద్దమునందు స్తిమిత విశాలనయనయై యామె దేదీప్యమానముగ నున్న నిజరూపమును జూచికొని ప్రియ సమీపగమనమునకై త్వరపడసాగెను. వనితలకు ప్రసాధనము ప్రియదర్శనైకఫలము.

అంతట మాంగళ్యమగు నార్ద్రహరిదళము నొక వ్రేలితో మనశ్శిల వెనుక వ్రేలితో తీసికొని-కర్ణావసక్త విమలదంతపత్త్ర మగు బిడ్డ నెమ్మోము పై కెత్తి-ఈడు వచ్చినప్పటినుండి ఆమెతోఁబాటు పెరిగిన తన తొలికోరికనే తల్లి కల్యాణచిహ్నముగ తిలకించెను. పొరిపొరి బాష్పములు క్రమ్ముకొనుచున్నదృష్టితో-ఒకచోటున కొకచోట నమర్పగా దాది వ్రేళ్ళతో జరిపి సరి చేయుచున్న పెండ్లి తోరమును తనయ చేతికిఁ గట్టెను.

సరిక్రొత్త తెలిపట్టుచీర కట్టికొని చేత దర్పణమును ధరించిన ఆదేవి తెలినుర్వు జాలుతోడి పాలసంద్రపు తీరము వలె, నిండుజాబిలితో నిండిన శరద్రాత్రివలె, దేదీప్యమానయై ప్రకాశించెను.

కార్యకుశలయైన జనని కుల ప్రతిష్ఠాభూతయైన యా వధువును కులదేవతలకెల్ల ప్రణామిల్ల జేసి వరుసగ పతిదేవతల కెల్ల పాదాభివందనము చేయించెను. ప్రణతయైన యుమాదేవిని వారు అఖండమైన పతిప్రేమ చూరగొనుమని యాశీర్వదించిరి. పతిశరీరార్ధమునె గెలిచికొనిన యాగౌరి బంధుజనాశీస్సులనెల్ల క్రిందుపఱచెను.

ఇట్లు కృతకృత్యుఁడై యద్రిరాజు తన యుత్సాహసంప దల కనురూపముగ వధువునకుఁ జేయదగినంతయు చేసి బంధు జనాధిష్ఠితమైన సభలో సభ్యుఁడై వృషభధ్వజాగమనమును ప్రతీక్షించుచుండెను.

కైలాసశైలమునను- సందడిపడుచున్న సప్తమాతృకలు ఆయాద్యవివాహమున కనురూపమైన ప్రసాధనము పురశాస నుని యెదుట నుంచిరి. కేవలము వారియందలి గౌరవముచేతనే పరమేశ్వరుడా మంగళాలంకరణభాండమును స్పృశించెను. ఆయన నిజవేషమే భావాంతరమున పెండ్లికొమరుని వేషముగ మారెను.

భసితమె సితాంగరాగ మయ్యెను. కపాలమె కలాప శోభ నలవరించికొనెను. గజాజినమె గోరోచనాంచితాంచల దుకూలరూపము దాల్చెను.

అంతర్గతామలపింగళ తారమైన ఆ లలాటలోచనమె హరితాళవిరచితమైన తిలకసాన్నిధ్యము వహించెను. యథా ప్రదేశ వినివేశితములైన ఫణీంద్రుల శరీరములే రూపాంతరము నందెను. కాని- ఫణరత్నశోభ లట్టిలే వెలుఁగుచుండెను. పట్ట పగటను కిరణముల విరజిమ్ముచు బాలభావముచేత అనావి ష్కృత కళంకుడగు చంద్రుడు మౌళిపై నిత్యము నెలకొని యున్న యా ప్రభువునకు వేఱొక చూడామణియేల ?

ఈ తీఱున సర్వైశ్వర్య ప్రభవభూమియైన యీశ్వరుడు నిజప్రభావమువలన ప్రసిద్ధవేష సంవిధానము నమరించుకొని

ఆసన్న గణోపనీతమైన ఖడ్గమునందు నిజప్రతిబింబమును జూచెను.

స్వామి నంది భుజావలంబియై, శార్దూలచర్మావృత విశాలపృష్ఠమై, భక్తివినమ్రమైన కైలాసగిరిని బోలిన వృషభేంద్రము నారోహించి కదలెను.

ఆ మహాదేవుని వెంట స్వవాహన ప్రకంపముచే చలితావతంసలై తమ ముఖమండలారుణ దీప్తులతో నంతరిక్షము నకు పద్మాకరశోభను గూర్చుచు సప్తమాతృకలు కదలిరి. కనక ప్రభలైన వారివెనుక కపాలాభరణయై కాళీమహాదేవి పురోభాగమున మెఱపులను విఱజిమ్ముచు కదలుచున్న బలాకలతోడి నీల పయోదమాలవలె కదలెను.

అప్పుడు శూలి యగ్రభాగమున నడచుచున్న ప్రమథులు సేయుచున్న తూర్యఘోషములు విమానశిఖరములలో ముఖరితములై సురలకు సేవావసరమును హెచ్చరించెను.

సహస్రరశ్మి ప్రభువునకు విశ్వకర్మనిర్మితమైన నవాతపత్రమును బట్టెను. ఆ ఛత్ర సమీపగతమాలికయై స్వామి యుత్తమాంగమున గంగ పడుచున్నయట్టులే భాసించెను.

గంగాయమునలు సాకారలై వచ్చి వింజామరలుదాల్చి నదీరూపము మాఱినను హంసప్రచాలనములు విడువలేనియట్లు స్వామిని సేవించుచుండిరి.

ఆద్యుఁడగు విధాతయును, శ్రీవత్సలాంఛనుఁడగు పురుషోత్తముఁడును స్వయముగ జయజయశబ్దములతో హవిస్సుతో

వహ్నినివలె శివమహిమము ప్రదీప్త మొనరించుచు నెదురు వచ్చిరి.

ఒకమూర్తియే మూఁడుగ మాఱెను. వారిలో వారికి ప్రథమావరభావము సామాన్యము. విష్ణునకు శివుడు, శివునకు విష్ణువు, వారిరువురకును బ్రహ్మ, బ్రహ్మకు వారిరువురును, ఆద్యు లగుచుందురు.

పురుహూతాదులైన లోకపాలురును తమతమ యధి కారచిహ్నములు విడిచి వినీతవేషులై దృష్టిప్రసాదనముకై నందికి సంజ్ఞచేసి అతఁడు సందర్శింపఁజేయగా మహాదేవునకు ప్రాంజలులై ప్రణమిల్లిరి.

శిరఃకంపముతో చతుర్ముఖుని, పలుకుతో హరిని, చిఱు నగవుతో నింద్రుని, ఆలోకమాత్రముతో అశేషసురలను,స్వామి యథార్హముగ సంభావించెను.

అగ్రభాగమున నిలిచిన సప్తర్షులావిభునకు జయాశీ స్సులు పలికిరి. స్వామియు స్మితపూర్వకముగ 'ఈ వివాహ మహాయజ్ఞములో నధ్వర్యువులుగ మిమ్ము పూర్వమె వరించి యుంటి' నని పలికెను. విశ్వావసు ప్రముఖులైన ప్రవీణులు త్రిపుర విజయాపదానము గానముసేయుచుండ – తమోవికా రముల కప్రాప్యుడైన తారాధిపమౌళి యంతరిక్షపథమును తరించెను.

పట్టెడల పసిడిమువ్వలు గల్లుగల్లుమనుచుండ - గగన ఘంటాపథము నందు - ఒయ్యారము నొలుకఁబోయుచున్న నడలతో - ఆదివృషభము కోరాటలో పంకమువలె మొయిలు క్రమ్మిన కొమ్ముకొసలను మాటిమాటికి నెగఁజిమ్ముకొనుచు శివమూర్తిని వహించెను. ఆవృషభస్వామి పురోవిలగ్నములైన శివదృష్టిపాతములె బంగారు ముకుదారములై తన్ను లాగికొనిపోవుచున్నవో యన్నట్లు నగేంద్రరక్షితమైన ఓషధిప్రస్థమును ముహూర్తకాలములో చేరికొనెను.

ఆనగరోపకంఠమున శివుఁడు తన ఘననీలకంఠమును కుతూహలోన్నమితకంఠులై ఓషధిప్రస్థపౌరులు చూచుచుండ స్వబాణచిహ్నమైన గగనమార్గమునుండి యవతరించి సమీప భూతలమున నిలిచెను.

బంధుజనాధిరూఢములైన గజబృందములతో నాగరికున కెదురువచ్చుచున్న గిరిచక్రవర్తి విరియఁబూచిన చెట్లతోనిండిన తన చేతికైలతో తరలివచ్చుచున్నట్లు తోచెను. పురద్వార కవాట మపావృతమైనంతనె దవ్వుగ వినవచ్చుచున్న కలకలముతో దేవమహీధరవర్గములు రెండును - ఏకసేతువును ఛేదించి రెండు ప్రవాహములవలె కలసిపోయెను.

త్రైలోక్యవంద్యుఁడు తనకు ప్రణమిల్లెనని హిమవంతుడు హిమంతుఁడయ్యెనుకాని ముందే తనశిరస్సు వినమితమయ్యెనని

యెఱుఁగఁడయ్యెను. ఆనంద వికసితాననాంచలుఁ డగుచు నచలేశ్వరుడు అల్లుని యగ్రభాగమున నడచుచు వెల్లివిరిసిన సంపదలతో చీలమండల మునుఁగునట్లు పూవులు పఱచిన రాజమార్గమున నిజమందిరమును ప్రవేశపెట్టెను.

ఆసమయమున నోషధిప్రస్థమున ప్రాసాదమాలలపై పనులన్నిటిని మానుకొని ఈశాన సందర్శనకుతూహలలైన పురసుందరీమణుల చేష్టితము లిట్లుండెను.

ఒక సుందరి గవాక్షపథమునకు త్వరితముగ వచ్చుచు విశీర్ణమైన క్రొమ్ముడినుండి జాఱిన మాల్యముతోడి కేశకలాపమును చేతఁబూని యెంతకును ముడుచుకోవలెననియే తలంపదాయెను.

వేఱొక చెలువ తన చరణాగ్రమును తడియాఱనీయకయె ప్రసాధికా హస్తమునుండి విదలించుకొని - విలాస గమనము నుజ్జగించి - త్రోవపొడుగున లత్తుక గుత్తులతో కెందామరలు విరియించెను.

ఒక విలాసిని తీర్చిన కాటుకతో దక్షిణవిలోచనమును మన్నించి, వామనేత్రమును మిన్నకయె వంచించి - అట్టులే చేతిలోని శలాకతో వాతాయనమును జేఱవచ్చెను.

ఒకరమణి సత్వరముగ లేచి తడబడుచు నిడుచున్న యడుగడుగున విడివడి - రత్నములు రాలుచుండ - సగముగ్రుచ్చిన

మణిమేఖలలో అంగుష్ఠమూలాశ్రితమైన దారమొక్కటియే మిగిలెను.

ఈరీతిగ సాంద్రకుతూహలలైన యా విలాసినుల యాసవగంధ గర్భితములును, చంచల నేత్రభ్రమరములునైన వదనములతో గవాక్షములు పద్మమాలాలంకృతములవలె నయ్యెను.

ఆవేళకు సౌధశిఖరాగ్రములనెల్ల పట్టపగలె జ్యోత్స్నాస్నాన మాడించుచు నిందుమౌళి ఎత్తిన పతాకలతో ఉత్తోరణమైన రాజపథము చేరవచ్చెను.

ఏకదృశ్యమైన ఆపరమేశ్వరుని కన్నులతోఁ గ్రోలుచున్న ఆ కాంతలకు విషయాంతర ప్రతిభానము లేకయుండెను. వారియితరేంద్రియవృత్తు లన్నియును సర్వాత్మనా ఒక్క చక్షురింద్రియమునే ప్రవేశించినవి కాఁబోలు.

"అతి సుకుమారియైనను మనయపర్ణ యీస్వామి కొఱకంత తపస్తప్త యగుట యుక్తమే. ఈప్రభువు దాస్యమునకేని నోచికొనగలిగిన స్త్రీ కృతార్థ. అంకశయ్యా సౌభాగ్యమునే చూఱగొనిన దనిన నింకేమి యనవచ్చును!

స్పృహణీయశోభమైన యీ జంట నొండొరులతో గూర్చమే యుండనిచో నీ యిరువురి కొఱకు విధాత యొనర్చిన రూపవిధాన యత్నమంతయు విఫలమై యుండును.

ఈయన యలుకవహించి యాయులరువిల్తుని దహించి యుండఁడు. కాముఁడే యీస్వామినిఁ జూచి సిగ్గుతో బ్రాణము విడిచియుండును.

'చెలీ! చిరమనోరథఫలమైన యీ యీశ్వరునితో సంబంధము వలన హిమశైలరాజు క్షితిధారణోన్నతమైన తన శిరస్సును మఱింత పైకెత్తగలఁడు.'

ఈరీతిగా తమలో నాడుకొనుచున్న యోషధిప్రస్థ సుందరీమణుల యాలాపములను శ్రవణసుఖముగ వినుచు పరమ శివుఁడు కేయూర చూర్ణీకృత లాజవృష్టియగు హిమాలయా లయమునకుఁ జేరెను.

అచట నచ్యుతుని కైదండగొని శరన్మేఘావతీర్ణుఁడైన ప్రభాకరునివలె వృషభేంద్రునిపైనుండి దిగి - కమలాసనుఁడు ముందు నడచుచుండ హిమగిరీశుని భవన కక్ష్యాంతరములను మహేశుఁడు ప్రవేశించెను. ఆస్వామి వెనువెంట ఇంద్రాది దేవ తలు, సప్తర్షి ప్రముఖ తపోధనులు, ప్రమథులు, ప్రశస్తారంభ మును ఉత్తమార్థములవలె ఆహిమవన్మందిరమును ప్రవేశించిరి.

అచట నీశ్వరుఁ డాసనస్థితుఁడై యథావిధిగ సరత్నమగు నర్ఘ్యమును మధుమంతమగు గవ్యమును నవదుకూలములను,

హిమవంతునిచే నర్పింపబడిన సర్వమును మంత్రపూర్వముగా గ్రహించెను.

ధృత సితదుకూల వసనుఁడై న యాశితికంఠుని వినీతులగు నంతఃపురవృద్ధులు - నవోదిత శశికిరణములు స్ఫుటఫేనచ్ఛటా భాసురమైన క్షీరనిధిని వేలా సమీపమునకువలె వధూసమీప మునకుఁ గొనివచ్చిరి.

ప్రవర్ధమానాననచంద్ర కాంతియైన యా వధువుతో సమాగతుఁ డగుచు శివుఁడు శరత్సమాగత మగుచున్న లోక మువలె ప్రఫుల్ల చక్షుఃకైరవములతో ప్రసన్న చేతస్సలిలుఁడై నిర్వృతి నొందెను.

యాదృచ్ఛిక సమాగమ చకితములై - ఒకించుక నిలువ రించికొని యోసరిలుచు పరస్పరావలోకనముల నెంతకును దనివిసెందని యా వధూవరుల విలోచనము లా ప్రథమక్షణ మునందు మనోహరమగు సిగ్గునొత్తిడి కొదిగియుండెను.

తనకు వెఱచి యిన్నాళ్ళుగ నుమాశరీరమున దాఁగియున్న మనసిజ ప్రథమాంకురమువోని యాగిరిజ కెంగేలు హిమవత్పు రోధసుఁ డందియీయ శివుఁడు గ్రహించెను.

మనసిజ ప్రవృత్తి యిరువురియందు సమవిభక్తమైనట్లుగ ఆ పాణిస్పర్శవలన ఉమ నెమ్మేను గలుపారెను. శివుని యంగుళులు స్విన్నము లయ్యెను.

ఎవరి సాన్నిధ్య విశేషమున వివాహములలో నే వధూవరులకైనను పరిణయశ్రీ నిండారియుండునో, ఆ యాదిదంపతుల పెండ్లిశోభ చెప్పుట కెట్లు లలవియగును ?

ఉదర్చియగు కృశానునకు ప్రదక్షిణ మొనరించువేళ నా మిథునము మేరుపరిసరములను జుట్టితిరుగుచున్న యన్యోన్య సంసక్తమగు అహర్నిశమువలె ప్రకాశించెను.

అన్యోన్య సంస్పర్శ నిమీలితాక్షులగుచున్న యా దంపతులచే పురోహితుఁ డట్లు వహ్నికి ముమ్మాఱు ప్రదక్షిణమాచరింపఁజేసి సమిద్ధార్చియగు నా వహ్నియందు వధువుచే లాజహోమ మొనరింపఁజేసెను.

పురోధ యుపదేశము ననుసరించి వధువు ఘ్రాణతర్పణమగు ఆ లాజధూమమును దోయిలించి నెమ్మోమునఁజేర్చెను. కపోలముల కెగఁబ్రాకుచున్న యా పొగమొలకలు క్షణకాల మామెకు కర్ణోత్పలభావమున నందగించెను. ఆ యాచారధూమస్పర్శ వలన ఆమె కపోలము లించుక చెమరించి యెఱ్ఱ

బాఱెను. కన్నులకాటుక కరఁగి చెదరెను. కర్ణావతంసిత మగు యవాంకురము వడలిపోయెను. అప్పుడు వధువుతో ద్విజుఁ డిట్లు లనెను. "తల్లీ! ఈవహ్ని నీ వివాహమునకు కర్మ సాక్షి! భర్తయగు శివునితో నీవిఁక నిర్విచారముగ సహధర్మ చర్య యొనర్పఁదగును."

నిదాఘ గాఢసంతప్తయైన పృథ్వి వార్షుకమేఘువు తొలి చినుకును వలె వీనులను ఆలోచనాంతముగ నారవిచ్చి భవాని ఆ గురువచనము గోరిలెను.

పిమ్మట ప్రియదర్శనుఁడు, శాశ్వతుఁడు నగు భర్త ధ్రువ నక్షత్ర దర్శనమునకై తన్ను నియోగింప నెట్టకేలకు నామె నెమ్మొగమెత్తి లజ్జావరుద్ధకంఠముతో "చూచితి" నని పలికెను.

ఈరీతిగ విధిజ్ఞుఁడగు పురోహితుఁడు వివాహక్రతువు నిర్వర్తింపగా ఆ జగత్పితరులు పద్మాసనస్థుఁడగు పరమేష్ఠికి ప్రణమిల్లిరి.

"కల్యాణీ! వీరప్రసవ వగు" మని విధాత వధువు నాశీర్వదించెను. వాచస్పతి యయ్యును – ఆ పితామహుఁడు అష్టమూర్తి నేమని యాశీర్వదింపవలయునో తోచక నివ్వెఱఁ బోయెను.

అంతట నా వధూవరులు పుష్పోపహారశోభితమగు చతురస్రవేదిపై కనకాసనస్థితులై లౌకికాచారమగు నార్ద్రాక్షతారోపణమున కొదల లొగ్గిరి.

అప్పుడు పత్రాంతలగ్న జలబిందువులతో ముక్తాఫలజాల శోభ నలవరించుకొని ఆయత నాళదండమగు కమలాతపత్రము లక్ష్మీదేవి వారికిఁ బట్టెను.

సంస్కృత ప్రాకృతరూపమున ద్విధాప్రయుక్తమగు వాఙ్మయముతో భారతి యాదంపతులను వరుని సంస్కారపూతమగు మార్గమున, వధువును లలితపదసరణిని నుతించెను.

ముఖాదిసంధులలో కైశిక్యాదివృత్తుల నేర్పరించి, రసానుగుణములగు రాగములను గూర్చి లలితాంగహారముగ నచ్చరలు ప్రయోగించిన నాటకమును ఆ పార్వతీ పరమేశ్వరు లొక ముహూర్తకాలము తిలకించిరి. ఆ నాటక ప్రయోగాంతమున పరిణీతుఁడగు పరమేశ్వరునకు దేవతలు కిరీటములపై దోసిళులొగ్గి ప్రణమిల్లి – శాపావసానమున పునఃప్రాప్తశరీరుఁడగు పంచశరుని సేవాస్వీకారమునకై అభ్యర్థించిరి.

పరమేశ్వరుఁడు శాంతక్రోధుఁడై తనయందును మరుఁడు శరములు నిగిడించుట కనుమతించెను. కార్యవిదులు సమయము

నెఱిఁగి చేసిన విన్నపము ప్రభువులయెడ తప్పక ఫలసిద్ధి నొందును.

పిమ్మట శశిమౌళి యా విబుధగణములను వీడ్కొని క్షితిధరరాజకన్య కేలూఁది కనకకలశసహితమై, పుష్పరచనా సనాథమై, క్షితివిరచిత తల్పమైన కౌతుకమందిరమున ప్రవేశించెను.

నవ పరిణయలజ్జావిభూషణయై, తన దెసకు మలఁచిన నెమ్మోము నోరగాఁ ద్రిప్పికొని శయనసఖులతోనైన పలుకక యున్న గౌరిని శివుఁడు ప్రమథ ముఖవికారములతో నిగూఢముగ నవ్వించెను.

ముద్రణము : బి. వి. అండ్ కో., ప్రెస్, రాజమండ్రి-1.